

## ఇంటి ఆడబిడ్డగా కవిత

- ముదిరాజ్ కుటుంబ వివాహ వేడుకలో ఆత్మీయత
- బాలప్రసాద్ కోరిక మేరకు ఆడపడుచుగా వ్యవహారం

3


వాస్తవాలు పలుకు

# DD9 వార్త

TE TL/26/A2635

తెలుగు దినపత్రిక








హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:105 | 27-08-2026 గురువారం | పేజీలు: 08 | వెల 3/-


## పార్టీ మారేది లేదు



- కొండా కుటుంబంపై ప్రచారాలను ఖండించిన మురళి
- కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- సోనియా, రాహుల్‌పై తమకు గౌరవం ఉందని వెల్లడి
- సుస్మిత వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని వ్యాఖ్య
- భట్టి విక్రమార్కతో భేటీకి రాజకీయ ప్రాధాన్యం లేదని వివరణ

2

## ఏఐసీసీకి సస్పెన్షన్ పంచాయితీ



- ఖర్గేతో భట్టి విక్రమార్క ప్రత్యేక భేటీ
- 40 నిమిషాల పాటు తాజా పరిణామాలపై చర్చ
- కొండా సురేఖ, చిన్నారెడ్డి నివేదికపై ఆరా
- పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనపై అధిష్ఠానం దృష్టి
- త్వరలో కీలక నిర్ణయం వెలువడే అవకాశం

2

## మేము ప్యూర్ కాంగ్రెస్



- భట్టితో భేటీ నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కోసమే
- తనపై విమర్శలు చేసేవారు ఆత్మపరిశీలన చేసుకోవాలన్న రాజగోపాల్‌రెడ్డి
- పార్టీ బలోపేతం కోసమే మాట్లాడుతున్నానని స్పష్టీకరణ
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగొద్దని వ్యాఖ్య
- కొండా సురేఖ, చిన్నారెడ్డి విషయంలో అధిష్ఠానం నిర్ణయమే తుది

3

## కొండా సురేఖపై

# వేటు తప్పదా?






### టీ కాంగ్రెస్ లో ఉత్కంఠ

- భట్టితో కొండా మురళి, రాజగోపాల్ రెడ్డి వరుస భేటీలు
- క్రమశిక్షణ కమిటీ నివేదికతో పెరిగిన ఉత్కంఠ
- సురేఖపై చర్యలకు రంగం సిద్ధమైందన్న చర్చ
- రాజగోపాల్ రెడ్డి భేటీపై కాంగ్రెస్‌లో ఆసక్తి
- కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని స్పష్టం చేసిన కొండా మురళి

**హైదరాబాద్, ఆగస్టు 26:**

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం రోజురోజుకూ ఉత్కంఠ రేపుతోంది. ఆమెపై పార్టీ అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకోబోతోందన్న సస్పెన్స్ కొనసాగుతున్న వేళ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కొండా సురేఖ భర్త కొండా మురళి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విడివిడిగా భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజాభవన్‌లో భట్టితో జరిగిన ఈ సమావేశాల్లో పార్టీలో చోటుచేసుకున్న తాజా పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. ఈ భేటీల్లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

**క్రమశిక్షణ కమిటీ నివేదిక**

మంత్రి కొండా సురేఖ పార్టీ నియమావళిని ఉల్లంఘించడం ఇది మూడోసారి అని, చిన్నారెడ్డి కూడా పార్టీ గీత దాటి మాట్లాడారని కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ పీసీసీ అధ్యక్షుడికి నివేదిక సమర్పించినట్లు సమాచారం. పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించే నేతలను ఇక ఉపేక్షిస్తే క్రమశిక్షణ దెబ్బతింటుందని కమిటీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదం ఇప్పటికే తీవ్రరూపం దాల్చింది. అనంతరం సురేఖ వ్యవహారంపై పార్టీలోని

మిగతా 2వ పేజీలో..



## అమెరికా ఘోర రోడ్డు ప్రమాదం

- నిజామాబాద్‌కు చెందిన నవీన్ ఉన్నట్లు సమాచారం

అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు మృతిచెందాడు. మృతుడిని నిజామాబాద్‌లోని గోపన్‌పల్లికి చెందిన రాహుల్‌గా గుర్తించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు కుటుంబసభ్యులకు ఈ సమాచారం అందింది.

2

## మీ సేవా కేంద్రాలే డిజిటల్ మార్కెటింగ్ హబ్‌లు

- రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ మార్కెటింగ్ సేవల విస్తరణ
- మెటాతో కలిసి వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ
- కొత్త పోర్టల్, టోల్‌ఫ్రీ సేవలను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

3






## తెలంగాణ సమ్మిట్‌కు

# వార్ రూమ్

- ప్రజాభవన్‌లో తక్షణమే ఏర్పాటుకు భట్టి ఆదేశం
- డిసెంబర్ సమ్మిట్‌కు దేశ, విదేశాల్లో విస్తృత రోడ్‌షోలు
- అతిథులకు ఆహ్వానాలు పంపే ప్రక్రియ వేగవంతం చేయాలి
- గత అవగాహన ఒప్పందాల పురోగతిపై ప్రత్యేక సమీక్ష
- రోజూ గంటపాటు పనుల పురోగతిని సమీక్షించనున్న సీఎస్

2

## పెట్టుబడులను ఆకర్షించేలా ఇన్వెస్ట్ తెలంగాణ

- నిపుణులతో కమిటీల ఏర్పాటు
- బొగ్గు నుంచి కీలక ఖనిజాల దిశగా సింగరేణి
- వ్యూహాత్మక ప్రణాళికతో సింగరేణి విస్తరణ
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్:**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా

మిగతా 2వ పేజీలో..



2

# మృత్యుఘోష

కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

ఆరుగురు ప్రయాణికులు దుర్మరణం

- ఆగివున్న ఐరన్ లారీని ఢీకొట్టిన బస్సు
- 20 మందికి తీవ్ర గాయాలు
- మృతులంతా ఏపీకి చెందినవారే
- ఘటనపై సీఎం, మంత్రి ఉత్తమ్ దిగ్భ్రాంతి

## పెట్టుబడులను ఆకర్షించేలా
# ఇన్వెస్ట్ తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

మహాత్మా పూలే ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని సూచించారు.

సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడిదారులను ఆకర్షించాలని చెప్పారు.

ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

**వ్యూహాత్మక ప్రణాళికతో సింగరేణి విస్తరణ**

తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయవంటి ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణిని లాభదాయక సంస్థగా నిలబెట్టి భవిష్యత్ తరాలకు అందించడమే తమ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బొగ్గు తవ్వకాలతో పాటుగా కీలక, వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. క్రిటికల్ మినరల్స్, బొగ్గు గనులకు సంబంధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే అన్ని వేలం ప్రక్రియల్లో పాల్గొనాలని ఆయన అధికారులకు చెప్పారు. బుధవారం ఉదయం మహాత్మా జ్యోతీరావు పూలే ప్రజా భవన్ లో సింగరేణి అధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సుదీర్ఘంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, తిరుమలరావు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావం వల్ల విద్యుత్ అవసరాలు పెరిగిన నేపథ్యంలో సింగరేణి డిమాండ్ కు తగ్గట్టుగా బొగ్గు ఉత్పత్తిని పెంచాలని అధికారులకు సూచించారు. సింగరేణి కేవలం బొగ్గు మైనింగ్ కే కాకుండా అన్ని రకాల మైనింగ్ లోకి ప్రవేశించాలని ఆయన అధికారులకు చెప్పారు. ఇందుకు ప్రజాప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తుందని అన్నారు. రానున్న కాలంలో వెనిడీయం, టైటానియం లాంటి ఖనిజాల బ్లాక్ లు వేలంలోకి వస్తున్న తరుణంలో వాటిని దక్కించుకునేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకువ వెళ్లాలని ఆయన అధికారులకు చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇంధన భద్రత విషయంలో సింగరేణి తన పాత్రనే మరింత గా పోషించాలని ఆయన చెప్పారు. ప్రపంచ మార్పులకు అనుగుణంగా కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాలు మైనింగ్ వైపు సింగరేణిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ అవకాశాలను అధ్యయనం చేసేందుకు సౌత్ ఆఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ వంటి దేశాల కోసం అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించామని డిప్యూటీ సీఎం చెప్పారు.

# పార్టీ మారేది లేదు

**హైదరాబాద్, ఆగస్టు 26:**

కొండా కుటుంబం కాంగ్రెస్‌ను వీడుతుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని సీనియర్ నాయకుడు కొండా మురళి ఖండించారు. తాము కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అంటే తమకు ఎంతో గౌరవం, అభిమానం ఉన్నాయని తెలిపారు. పార్టీ మార్పుపై వస్తున్న ప్రచారాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు.

**కూతురి వ్యవహారంతో సంబంధం లేదు**

తన కూతురు సుస్మిత వ్యాఖ్యలు, వాటిపై జరుగుతున్న చర్చపై కొండా మురళి స్పందించారు. సుస్మిత తన ఒక్కగానొక్క బిడ్డ అని, ఆమెకు సంబంధించిన వివాదంతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. అది పూర్తిగా ఆమె వ్యక్తిగత వ్యవహారమని పేర్కొన్నారు. ఆమె ఆలోచనలు, భవిష్యత్ నిర్ణయాలు తనకెలా తెలుస్తాయని ప్రశ్నించారు. ఆమె ప్లాన్‌ఎలో ఏం మాట్లాడిందో తెలుసని, ప్లాన్‌బిలో ఏం చేస్తుందో తనకేం తెలుసంటూ వ్యాఖ్యానించారు.

**భట్టి భేటీపై వివరణ**

కాంగ్రెస్ పార్టీ మారే ప్రసక్తే లేదని మరోసారి స్పష్టం చేసిన మురళి.. ఈ విషయంలో మీడియా తొందరపడాల్సిన అవసరం లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో జరిగిన భేటీకి రాజకీయ ప్రాధాన్యం లేదని చెప్పారు. కేవలం యోగక్షేమాలు తెలుసుకునేందుకే భట్టిని కలిశామని, దానికి ఇతర అర్థాలు ఆపాదించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పార్టీ మార్పుపై జరుగుతున్న ప్రచారాలకు తమ వైఖరితోనే తెరపడుతుందని పేర్కొన్నారు.

# ఏఐసీసీకి సస్పెన్షన్ పంచాయితీ

**బెంగళూరు, ఆగస్టు 26:**

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి వ్యవహారం ఏఐసీసీ కేంద్ర కార్యాలయానికి చేరింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం రాత్రి బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆయన నివాసంలో ప్రత్యేకంగా కలిశారు. సుమారు 40 నిమిషాల పాటు జరిగిన భేటీలో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నివేదిక, రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం.

**క్రమశిక్షణ కమిటీ నివేదికపై ఆరా**

కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారంలో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ రూపొందించిన నివేదికను ఖర్గే పరిశీలించినట్లు తెలుస్తోంది. నివేదికలో పేర్కొన్న అంశాలు, సంబంధిత నేతల వ్యవహారశైలిపై భట్టి విక్రమార్క నుంచి ఖర్గే వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, క్రమశిక్షణ ఉల్లంఘనపై అధిష్ఠానం అనుసరించాల్సిన వైఖరిపైనా చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

**కీలక నిర్ణయంపై ఉత్కంఠ**

ప్రజాభవన్‌లో కొండా మురళి, కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డిలు భట్టిని కలిసిన అనంతరం ఆయన హుటాహుటిన బెంగళూరు వెళ్లి ఖర్గేతో సమావేశం కావడం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించిన నేతలపై కఠిన చర్యలు తీసుకునే అంశాన్ని అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. కొండా సురేఖ, చిన్నారెడ్డిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అధిష్ఠానం నుంచి త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.



# మృత్యుఘోష

**సూర్యాపేట, ఆగస్టు 26:**



తెల్లవారుజామున గాఢనిద్రలో ఉన్న ప్రయాణికులను మృత్యువు వెంటాడింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో రహదారిపై ఆగివున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. మృతులను ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇనుప సామగ్రితో ఉన్న లారీ రహదారిపై ఆగి ఉండగా ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు లారీలోని ఇనుప సామగ్రి బస్సులోకి చొచ్చుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తెల్లవారుజాము కావడంతో పలువురు ప్రయాణికులు నిద్రలో ఉండటం, ప్రమాదాన్ని గుర్తించి తప్పించుకునే అవకాశం లేకపోవడంతో ప్రాణనష్టం ఎక్కువైనట్లు తెలుస్తోంది. ఉదయం 9 గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగం ప్రమాదానికి కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదం అనంతరం బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీ కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

**'కళ్ల ముందే నా భార్య చనిపోయింది'**

ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఓ ప్రయాణికుడి ఆవేదన అక్కడున్న వారిని కలచివేసింది. తన వెనుక సీటులో కూర్చున్న భార్య ప్రమాదంలో కళ్ల ముందే ప్రాణాలు కోల్పోయిందంటూ ఆయన కన్నీరుమున్నీరయ్యారు. టీ విరామం అనంతరం బస్సు తిరిగి బయలుదేరిన గంటలోపే ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. ముందు సీట్లలో కూర్చున్న ప్రయాణికుల్లోనూ కొందరు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే ఇనుప సామగ్రి బస్సులోకి దూసుకురావడంతో ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయని వివరించారు. "డ్రైవర్ నిర్లక్ష్యం, నిద్రమత్తులో బస్సు నడపడమే ఈ ఘోరానికి కారణం. నా కళ్ల ముందే నా భార్య ప్రాణాలు కోల్పోయింది" అంటూ బాధిత ప్రయాణికుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారిలో 14 మందిని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పలువురికి తల, ఛాతీ, కడుపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఇనుప సామగ్రి బలంగా తాకడంతోనే గాయాల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వైద్యవర్గాలు పేర్కొన్నాయి. అప్పటికే ప్రమాదానికి గురై రహదారిపై నిలిచిపోయిన లారీని ట్రావెల్స్ బస్సు డ్రైవర్ సకాలంలో గుర్తించకపోవడం వల్లే ప్రమాద తీవ్రత పెరిగిందని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**సీఎం రేవంత్ దిగ్భ్రాంతి**

కోదాడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రయాణికుల భద్రతకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు వ్యవహరించాలని సూచించారు.

# టీ కాంగ్రెస్‌లో ఉత్కంఠ

**మొదటిపేజీ తరువాయి**




పలువురు నేతలు బహిరంగంగా స్పందించారు. ఇప్పుడు క్రమశిక్షణ కమిటీ నివేదిక కూడా రావడంతో సురేఖపై చర్యలు తప్పవన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో మరింత బలపడింది.

**భట్టితో భేటీలపై చర్చ**

ఈ పరిణామాల మధ్య కొండా మురళి భట్టి విక్రమార్కను కలవడం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. సురేఖపై చర్యల నుంచి ఉపశమనం కోసం భట్టితో చర్చించారా అన్న ఊహాగానాలు వినిపించాయి. అయితే తాను ఒక బిల్లు విషయమై భట్టిని కలిసినట్లు కొండా మురళి వెల్లడించారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఈ వ్యవహారంపై ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని చెప్పారు. మరోవైపు రాజగోపాల్ రెడ్డి కూడా భట్టితో భేటీ కావడం కాంగ్రెస్‌లో చర్చకు దారితీసింది. కొండా సురేఖ, చిన్నారెడ్డిపై చర్యలు తీసుకునే పరిస్థితి వస్తే.. పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించిన ఇతర నేతలపైనా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ రావచ్చనే చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలోనే రాజగోపాల్ రెడ్డి ముందస్తుగా భట్టిని కలిశారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఆయన భేటీకి ఇదే కారణమని నిర్ధారించే ఆధారాలు లేవు.

**కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం**

భట్టి విక్రమార్కతో భేటీ అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. తమ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆమెకు ఆమె మనోభావాలు ఉంటాయని, ఆమెను ప్రశ్నించే హక్కు తమకు లేదన్నారు.

గాంధీ కుటుంబంపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని, తాము కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని కొండా మురళి తెలిపారు. తాను ఒక బిల్లు విషయమై భట్టిని కలిసినట్లు చెప్పారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఈ అంశంపై మాట్లాడబోనని స్పష్టం చేశారు. క్రమశిక్షణ కమిటీ నివేదిక పీసీసీ నాయకత్వానికి చేరిన నేపథ్యంలో ఇప్పుడు అధిష్టానం నిర్ణయంపైనే అందరి దృష్టి ఉంది. కొండా సురేఖపై చర్యలు ఉంటాయా.. ఉంటే ఎలాంటి చర్య తీసుకుంటారు.. ఇతర నేతల వ్యవహారంపై పార్టీ ఎలా స్పందిస్తుందన్నదే ప్రస్తుతం టీ కాంగ్రెస్‌లో ప్రధాన చర్చగా మారింది.

## తెలంగాణ సమ్మిట్‌కు
# వార్ రూమ

**హైదరాబాద్, ఆగస్టు 26:**

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026, ఇన్వెస్ట్ తెలంగాణ' కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. సమ్మిట్ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేసేందుకు ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక 'వార్ రూమ' ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్షించింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో వార్ రూమ్ పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని భట్టి సూచించారు. వార్ రూమ్ పనితీరును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పర్యవేక్షించాలని చెప్పారు. సమ్మిట్ కోసం ఇప్పటికే ఏర్పాటు చేసిన వివిధ కమిటీల్లో అవసరమైన నిపుణులు, కీలక అధికారులను భాగస్వాములను చేయాలని సూచించారు.

**ఆహ్వానాల్లో జాప్యం వద్దు**

ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ రంగాల ప్రతినిధులను ఆహ్వానించేందుకు చర్యలు వేగవంతం చేయాలని భట్టి ఆదేశించారు. అతిథులకు ఆహ్వాన పత్రాలు పంపడంలో ఏమాత్రం ఆలస్యం జరగకూడదని స్పష్టం చేశారు. ఎవరెవరిని ఆహ్వానించాలి, వారితో సంప్రదింపులు ఏ స్థాయిలో ఉన్నాయి తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**దేశ విదేశాల్లో రోడ్‌షోలు**

డిసెంబర్‌లో జరగనున్న సమ్మిట్‌ను విజయవంతం చేయడం తో పాటు తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృత స్థాయిలో రోడ్‌షోలు నిర్వహించాలని భట్టి సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, పారిశ్రామిక అనుకూల విధానాలను పెట్టుబడిదారులకు వివరించేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు.

**గత ఒప్పందాల పురోగతి తేల్చండి**

గతంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా వివిధ సంస్థలతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల పరిస్థితిపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్ని ఒప్పందాలు కార్యరూపం దాల్చాయి, ఎన్ని ప్రాజెక్టులు అమలు దశలో ఉన్నాయి, ఎక్కడ జాప్యం జరుగుతోంది, పెట్టుబడులు ఎంతవరకు వచ్చాయన్న అంశాలపై సమగ్ర విశ్లేషణ చేయాలని భట్టి ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీకి బాధ్యతలు అప్పగించాలని సూచించారు.

**రోజూ గంటపాటు సమీక్ష**

సమ్మిట్ ఏర్పాట్లలో జాప్యానికి తావులేకుండా ప్రతి కమిటీకి స్పష్టమైన కాలపరిమితి నిర్దేశించాలని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతిరోజూ కనీసం గంటపాటు సమ్మిట్ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి కమిటీ తనకు అప్పగించిన బాధ్యతలను నిర్ణీత కాలపట్టిక ప్రకారం పూర్తి చేసేలా వార్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడుల గమ్యస్థానంగా మరింత బలంగా ఆవిష్కరించే లక్ష్యంతో సమ్మిట్ నిర్వహణలో ఎక్కడా లోటుపాట్లకు అవకాశం ఇవ్వకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికార యంత్రాంగానికి భట్టి విక్రమార్క దిశా నిర్దేశం చేశారు.



## అమెరికా ఘోర
# రోడ్డు ప్రమాదం

- **చెట్టును ఢీకొన్న కారు.. ముగ్గురు దుర్మరణం**

**నిజామాబాద్, ఆగస్ట్ 26:**



అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు మృతిచెందాడు. మృతుడిని నిజామాబాద్‌లోని గోపన్‌పల్లికి చెందిన రాహుల్‌గా గుర్తించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు కుటుంబసభ్యులకు ఈ సమాచారం అందింది. ఉన్నత చదువుల కోసం మ□డు నెలల క్రితం అమెరికా వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు హరిబాబు, నాగమణి కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువకులు మృతిచెందారని తెలుస్తోంది.. ఫ్లోరిడాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. మృతుల్లో నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు చెందిన రాహుల్ ఉన్నారు. రాహుల్ సుమారు మ□డు నెలల క్రితమే అమెరికాకు వెళ్లాడు. ఉన్నత చదువులు లేదా ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన కొద్దికాలానికే రోడ్డు ప్రమాదంలో అతను ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మంగళవారం రాత్రి మొత్తం ముగ్గురు స్నేహితులు కలిసి కారులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కారు చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందినట్లు రాహుల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాహుల్ మృతితో నవీపేట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మ□డు నెలల క్రితమే అమెరికా వెళ్లిన యువకుడు ఇలా అనూహ్యంగా మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# మీ సేవా కేంద్రాలే డిజిటల్ మార్కెటింగ్ హబ్‌లు

**హైదరాబాద్, ఆగస్టు 26:**

తెలంగాణలోని ప్రతి మీ సేవా కేంద్రాన్ని డిజిటల్ మార్కెటింగ్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. స్థానిక వ్యాపారులకు డిజిటల్ ప్రచార అవకాశాలను చేరువ చేయడమే లక్ష్యంగా మీ సేవా-మెటా సంయుక్త కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని షెరటాన్ హోటల్‌లో బుధవారం మీ సేవా డిజిటల్ మార్కెటింగ్ శిక్షణ రెండో దశ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 140 మందికి పైగా మీ సేవా విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్లు (వీఎల్‌ఈలు) హాజరయ్యారు. వీరికి 'డిజిటల్ బిజినెస్ అంబాసిడర్లుగా' ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కొత్త సాంకేతికతను స్వీకరించడంలో తెలంగాణ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. సమర్థవంతమైన పౌర సేవలను అందించడంలో రాష్ట్రం ప్రత్యేక గుర్తింపు సాధించిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 5 వేలకుపైగా మీ సేవా కేంద్రాలు ఉన్నాయని వివరించారు. వీటి ద్వారా స్వీట్ షాపుల నుంచి టెక్స్ టైల్ స్టోర్స్, నైపుణ్య వృత్తిదారులు, ఇతర చిన్న వ్యాపారులకు డిజిటల్ మార్కెటింగ్ అవకాశాలను చేరువ చేయవచ్చని వెల్లడించారు. వ్యాపారులు తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఈ సేవ ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. మీ సేవా కేంద్రాలు పౌర సేవలకే పరిమితం కాకుండా ప్రజలకు డిజిటల్ అవగాహన కల్పించి, ఆదాయ అవకాశాలను పెంచే వేదికలుగా మారాలని తెలిపారు. కొత్త ఆలోచనలు, సేవలు, వ్యాపార అవకాశాలను తెలంగాణ ఎప్పుడూ స్వాగతిస్తుందని వెల్లడించారు. ప్రజల ఆదాయం, దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఇవి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తొలుత హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ/క్యూర్ పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు. సుమారు 120 మంది మీ సేవా వీఎల్‌ఈలకు డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా ప్రకటనలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారిలో 10 మందికిపైగా ఇప్పటికే ప్రత్యక్ష డిజిటల్ ప్రకటనల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. స్థానిక వ్యాపారులకు ఇప్పటివరకు 17కుపైగా ప్రకటనలను రూపొందించి ప్రచురించారు. ఈ కార్యక్రమంతో వీఎల్‌ఈలకు కొత్త ఆదాయ మార్గం అందుబాటులోకి వచ్చింది. స్థానిక వ్యాపారులు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వేదికల్లో తక్కువ వ్యయంతో తమ ఉత్పత్తులు, సేవలను ప్రచారం చేసుకునే అవకాశం ఏర్పడింది. తొలి దశలో మంచి ఫలితాలు రావడంతో ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరిస్తున్నారు. రెండో దశలో ప్రతి జిల్లా నుంచి నలుగురు నుంచి ఐదుగురు చొప్పున వీఎల్‌ఈలను ఎంపిక చేశారు. డిజిటల్ మార్కెటింగ్‌పై ప్రాథమిక అవగాహన, ఆసక్తి, స్థానిక వ్యాపారులతో సమర్థంగా సంప్రదించే సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేపట్టారు.

శిక్షణ పొందిన వీఎల్‌ఈలు తమ జిల్లాల్లో 'డిజిటల్ బిజినెస్ అంబాసిడర్లుగా' పనిచేస్తారు. స్థానిక వ్యాపార అవసరాలను గుర్తించడం, డిజిటల్ మార్కెటింగ్ ప్రయోజనాలను వివరించడం, ప్రకటనల రూపకల్పనలో సహకరించడం, సరైన లక్ష్య వినియోగదారులను గుర్తించడం వంటి సేవలను అందిస్తారు. వ్యాపార విస్తరణలోనూ నిరంతర సహకారం అందించనున్నారు.



**మెటాతో ఎంఓయూ**

కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డీ), ఐటీ అండ్ సీ శాఖ, మెటా సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దీంతో మీ సేవా డిజిటల్ మార్కెటింగ్ కార్యక్రమంలో రెండు సంస్థల భాగస్వామ్యం అధికారికంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మీ సేవా కమిషనర్, ఈఎస్‌డీ అధికారి టి.రవికిరణ్, ఐఎఫ్ఎస్, మెటా మేనేజింగ్ డైరెక్టర్, కంట్రీ హెడ్ అరుణ్ శ్రీనివాస్, స్ట్రాటజిక్ ప్రోగ్రామ్స్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్ హెడ్ దివ్య ఖేమాని వధేరా, మీడియా, ట్రావెల్ అండ్ సర్వీసెస్ ఎకోసిస్టమ్ వర్టికల్ హెడ్ రిషాద్ చిందమడ తదితరులు పాల్గొన్నారు.

**కొత్త పోర్టల్, హెల్ప్‌లైన్ ప్రారంభం**

స్థానిక వ్యాపారులు మీ సేవా ద్వారా నేరుగా డిజిటల్ మార్కెటింగ్ సహాయం కోరేలా కొత్త సదుపాయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు.

**పోర్టల్: meeseva.telangana.gov.in**

**టోల్‌ఫ్రీ నంబర్లు: 1100 / 1800-425-1110**

ఈ సేవతో వ్యాపారులకు అందుబాటు ధరల్లో డిజిటల్ మార్కెటింగ్ అవకాశాలు లభిస్తాయి. వినియోగదారులు తమ ప్రాంతంలోని ఉత్పత్తులు, సేవలను సులభంగా గుర్తించగలుగుతారు. వీఎల్‌ఈలకు అదనపు ఆదాయ మార్గం ఏర్పడుతుంది. రాష్ట్రంలో డిజిటల్ వ్యాపార వ్యవస్థ మరింత బలోపేతం కానుంది.

శిక్షణ పొందిన ప్రతి వీఎల్‌ఈ తొలుత ఒక వ్యాపారంతో పని ప్రారంభించి, ఆ తర్వాత పది, వంద వ్యాపారాలకు సేవలను విస్తరించేలా ముందుకు సాగాలని ప్రభుత్వం సూచించింది. ప్రతి జిల్లాలో శిక్షణ పొందిన డిజిటల్ మార్కెటింగ్ వీఎల్‌ఈలు అందుబాటులో ఉండాలన్నది లక్ష్యమని వెల్లడించింది. ప్రతి స్థానిక వ్యాపారికి తక్కువ వ్యయంతో డిజిటల్ ప్రచార సహాయం అందుబాటులోకి తేవాలని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమం అమలులో భాగస్వాములైన ఈఎస్‌డీ-మీ సేవా బృందం, మెటా ప్రతినిధులు, వీఎల్‌ఈల సేవలను మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు.

# ప్రభుత్వ భూములను, ఆస్తులను తెగనమ్ముతున్న రేవంత్ ప్రభుత్వం

- **ఇప్పటికే రూ.30వేల కోట్ల విలువైన భూముల అమ్మకం**
- **హైదర్‌నగర్‌లో పిల్లల పార్కు స్థలాన్ని కూడా అమ్మకానికి పెట్టారు**
- **సామాన్యుల భూములను 22ఎలో చేర్చి వేధింపులు**
- **విలువైన ప్రభుత్వ భూములు సీఎం బంధుమిత్రులకు ధారాదత్తం**
- **ఇలా భూములు అమ్ముకుంటూ పోతే, రేపు పరిస్థితేంటి?**
- **కూకట్‌పల్లి 22ఎ బాధితులకు అండగా నిలుస్తాం**
- **మాజీ మంత్రి హరీష్‌రావు హామీ**

**హైదరాబాద్, ఆగస్టు 26:**

'అసలు ఏ ఉద్దేశంతో ప్రభుత్వం ఈ 22ఎ ఆంక్షలను తీసుకొచ్చింది? ప్రభుత్వ బాధ్యత ఏమిటి? ప్రజలకు కావాల్సిన విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, రవాణా, ఉద్యోగాలు, రైతుల సంక్షేమం కోసం పనిచేయాల్సిన ప్రభుత్వం.. ఆ సమస్యలను గాలికొదిలేసి కేవలం భూముల చుట్టూ ఎందుకు తిరుగుతోంది? ఒక్క మాటలో చెప్పాలంటే.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలే కేంద్రంగా పరిపాలన సాగింది. కానీ, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కేవలం భూములే కేంద్రంగా పరిపాలన సాగుతోందని మాజీ మంత్రి హరీష్‌రావు (MLA Hairsh Rao) ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ ఎన్‌ఆర్‌ఎస్‌ఏ కమ్యూనిటీ హాల్‌లో 22ఎ నిషేధిత భూముల సమస్యతో ఇబ్బంది పడుతున్న బాధిత కుటుంబాలతో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు బుధవారం సమావేశమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 22ఎ బాధితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**టైమ్మేనేజ్‌మెంట్ క్యాలెండర్‌లను ఉపయోగించడం**

బాధితుల ఆవేదనను స్వయంగా అడిగి తెలుసుకున్న హరీశ్ రావు.. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాకముందు హైదరాబాద్‌తో సహా రాష్ట్రమంతా కరెంటు కష్టాలు ఉండేవి. తాగునీరు, ట్రాఫిక్, సాగునీటి సమస్యలతో ప్రజలు అల్లాడిపోయారు. కానీ, కేసీఆర్ అధికారంలోకి రాగానే వాటన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికి తాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్ అందించడంతో పాటు హైదరాబాద్ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎన్నో ఫ్లైఓవర్లు నిర్మించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచి, యువతకు ఉద్యోగాలు వచ్చేలా అద్భుతమైన ప్రగతిని సాధించారు. ఒకప్పుడు తెలంగాణ అంటే కరువు, రైతుల ఆత్మహత్యలు అనే పరిస్థితి ఉండేది. కానీ కేసీఆర్ పాలనలో.. గంగా నదీ పరివాహక ప్రాంతాల్లో ఉండి దేశంలోనే వరి ఉత్పత్తిలో నంబర్ వన్ స్థానంలో ఉన్న పంజాబ్, హర్యానా రాష్ట్రాలను సైతం తలదన్ని తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టారు. కూకట్‌పల్లినే తీసుకుంటే.. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఇక్కడి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశాం. పెద్ద పెద్ద రిజర్వాయర్లు, పైప్‌లైన్లు, మౌలిక వసతులు నిర్మించాం. నిజాం, బ్రిటిష్ కాలంలో కట్టిన ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులపైనే ఆధారపడే పరిస్థితిని మార్చేసి.. నగర నలువైపులా టిమ్స్ ఆసుపత్రులు నిర్మించాం. ఒక్క కూకట్‌పల్లిలోనే 20కి పైగా బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసి పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేశాం. కేసీఆర్ ఆలోచనలన్నీ పేదల కోసం కల్యాణలక్ష్మి, వృద్ధులకు ఆసరా పెన్షన్లు, ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం, బస్తీ దవాఖానాలు, మిషన్ భగీరథ, 24 గంటల విద్యుత్, రైతాంగానికి సాగునీరు.. ఇలా సాగాయని గుర్తుచేశారు.



ఇవే బీఆర్‌ఎస్ పదేళ్ల సువర్ణ పాలనకు గుర్తులు. మరి ఈరోజు రేవంత్ రెడ్డి పాలనలో పరిస్థితి ఏమిటి? ప్రజల సమస్యలు పరిష్కరించడం కంటే, ప్రభుత్వ భూములను అమ్ముకోవడానికే ఈ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. హౌసింగ్ బోర్డు భూములు, టీజీఐఐసీ భూములు.. ఇలా ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపిస్తే అక్కడ బోర్డు పాతేసి అమ్మకానికి పెట్టడమే కాంగ్రెస్ విధానంగా మారింది. ప్రభుత్వ భూములు అంటే మన భవిష్యత్ తరాల ఆస్తి, అవి అమ్ముకోవడానికి కాదు. హైదర్ నగర్‌లో కిషన్ రావు , అక్కడి కాలనీవాసులు పోరాడితే పిల్లలు ఆడుకోవడానికి కేసీఆర్ వెయ్యి గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. దుర్మార్గమైన రేవంత్ రెడ్డి సర్కార్ ఆ పార్కు స్థలాన్ని కూడా అమ్మకానికి పెట్టింది. బీఆర్‌ఎస్ పదేళ్ల ప్రభుత్వ హయాంలో హౌసింగ్ బోర్డుకు చెందిన ఒక్క గజం భూమిని కూడా అమ్మకానికి పెట్టలేదు. కానీ, రేవంత్ రెడ్డి రాగానే ఈ తక్కువ కాలంలోనే సుమారు రూ.30 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను తెగనమ్మేశాడు.

ఇలా అడ్డగోలుగా భూములన్నీ అమ్ముకుంటూ పోతే.. రేపటి భవిష్యత్ తరాలకు ఒక దేవాలయం, మసీదు, చర్చి నిర్మించాలన్నా, ఆసుపత్రి, పాఠశాల, వాటర్ ట్యాంక్ కట్టాలన్నా.. కనీసం చనిపోతే దహన సంస్కారాలకు వైకుంఠధామం నిర్మించడానికి కూడా స్థలం దొరకని పరిస్థితి వస్తుంది. ఒకవైపు ప్రభుత్వ భూములను అమ్మకానికి పెడుతూనే, మరోవైపు దళితులు, గిరిజనులు, బీసీ వర్గాలకు గతంలో కేటాయించిన అసైన్డ్ భూములపై కన్నేశారు. లక్షలాది మంది పేదలకు భరోసాగా ఉన్న ఆ భూములను లాక్కొని దళారుల ద్వారా కమీషన్లకు కట్టబెడుతున్నారు. కష్టపడి పైసా పైసా కూడబెట్టుకుని కొనుక్కున్న సామాన్యుల భూములను మాత్రం రాత్రికి రాత్రే 22ఎ నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను వేధిస్తున్నారు. కానీ, ప్రభుత్వ ఆస్తులైన అత్యంత విలువైన భూములను మాత్రం సీఎం తన కుటుంబ సభ్యులకు, అనుయాయులకు కారుచౌకగా దారాదత్తం చేస్తున్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలను బీఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. 22ఎ బాధితుల పక్షాన, సామాన్యుల ఆస్తుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచైనా సరే రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# మేము ప్యూర్ కాంగ్రెస్

**హైదరాబాద్, ఆగస్టు 27:**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో తన భేటీ నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కోసమే జరిగిందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ప్రజాభవన్‌లో భట్టిని కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై విమర్శలు చేస్తున్నవారు ముందుగా తనను ఎందుకు విమర్శిస్తున్నారో, తమ స్థాయి ఏమిటో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. తాను కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తి లేదని, పార్టీ బలోపేతం కోసమే తన గళం వినిపిస్తానని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ కోసం పోరాడా**

తాను కాంగ్రెస్‌లో సీనియర్ నేతల్లో ఒకడినని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. పార్టీ కష్టకాలంలో బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడిన వారిలో తానొకడినని చెప్పారు. 2018 ఎన్నికల్లో పెద్దపెద్ద నేతలు ఓటమి పాలైనా మునుగోడు ప్రజలు తనను గెలిపించారని గుర్తుచేశారు. తెలంగాణలో ప్రతిపక్షమే లేకుండా చేయాలని ప్రయత్నించిన కేసీఆర్‌కు వ్యతిరేకంగా సర్వస్వం ధారపోసి పోరాడానన్నారు. తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నానని, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నానని పేర్కొన్నారు.

**నిజమైన కార్యకర్తలకు అండగా**

తాను తెలంగాణ కోసం ఎంతో పోరాడానని, పార్టీకి వ్యతిరేకంగా ఎప్పుడూ మాట్లాడలేదని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. వ్యక్తిగతంగా సీఎం రేవంత్‌రెడ్డిని గానీ, ఇతర నాయకులను గానీ విమర్శించలేదని చెప్పారు. ఎన్నికల సమయంలో పార్టీలోకి వచ్చిన వారికి టికెట్లు ఇచ్చి, వారు గెలిచిన తర్వాత నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు నష్టం జరుగుతోందని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీ, అధిష్ఠానంపై ఉందని చెప్పానన్నారు. ఇదే విషయాన్ని ఇప్పటికీ చెబుతున్నానని తెలిపారు.

**రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం**

తాను ఏది మాట్లాడినా పార్టీని బలోపేతం చేయడానికేనని రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. పార్టీని బలహీనపరిచేలా తాను ఎప్పుడూ మాట్లాడబోనన్నారు. తెలంగాణ కోసం నిజాయితీగా పోరాడిన ఉద్యమకారులు ఎంతో మంది ఉన్నారని, ఇతర పార్టీల నుంచి వచ్చినవారు ఉన్నత పదవుల్లో ఉండవచ్చని పేర్కొన్నారు. అయితే అసలైన కాంగ్రెస్ కార్యకర్తలను కించపరిచేలా కథనాలు రాయడం సరికాదన్నారు. మాది ప్యూర్ కాంగ్రెస్ అని స్పష్టం చేశారు.

**అధిష్ఠానం నిర్ణయమే తుది**

కొండా సుస్మిత, చిన్నారెడ్డి వ్యాఖ్యలపై స్పందించిన రాజగోపాల్‌రెడ్డి.. ఈ వ్యవహారంలో అధిష్ఠానం నిర్ణయమే తుది అని అన్నారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కూడా చెప్పారని, ఈ అంశంలో సీఎం మాటే తన మాట అని స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారంపై లోతుగా పరిశీలించి పీసీసీకి నివేదిక ఇచ్చిందని తెలిపారు. నివేదిక ఆధారంగా అధిష్ఠానం తీసుకునే నిర్ణయాన్ని ఎవరూ కాదనలేరని పేర్కొన్నారు.





# ఇంటి ఆడబిడ్డగా కవిత

- **ముదిరాజ్ కుటుంబ వివాహ వేడుకలో ఆత్మీయత**
- **బాలప్రసాద్ కోరిక మేరకు ఆడపడుచుగా వ్యవహారం**
- **సంప్రదాయం ప్రకారం వధువు మెడలో మూడు ముళ్లు**
- **గౌరీ పూజలో పాల్గొని వధువును ఆశీర్వదించిన కవిత**
- **ఆత్మీయంగా సాగిన వివాహ వేడుక**

**హైదరాబాద్, ఆగస్టు 27:**

రాజకీయ నాయకులు సాధారణంగా సభలు, సమావేశాలు, ప్రజా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువవుతుంటారు. అయితే తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఓ వివాహ వేడుకలో కుటుంబ సభ్యురాలిగా మారి ఆత్మీయత చాటుకున్నారు. పార్టీ నాయకుడు బాషబోయిన బాలప్రసాద్ కోరిక మేరకు ఆయన కుటుంబానికి చెందిన ఇంటి ఆడబిడ్డగా వ్యవహరించి వివాహ వేడుకను దగ్గరుండి నిర్వహించారు. ఈసీఐఎల్ కీసర క్రాస్‌రోడ్డులోని ఆరాధ్య కన్వెన్షన్‌లో ఈ వేడుక జరిగింది.

**సంప్రదాయం ప్రకారం మూడు ముళ్లు**

యాదాద్రి భువనగిరి జిల్లా గూడూరు గ్రామానికి చెందిన బాషబోయిన బాలప్రసాద్ తెలంగాణ రక్షణ సేనలో కీలకంగా పనిచేస్తున్నారు. తెలంగాణ జాగృతిలోనూ ఆయన క్రియాశీలకంగా ఉన్నారు. సీతాఫల్‌మండికి చెందిన శివానితో ఆయన వివాహం బుధవారం ఉదయం జరిగింది. బాలప్రసాద్‌కు అక్కాచెల్లెళ్లు లేకపోవడంతో తన కోరిక మేరకు కవిత ఆడపడుచుగా వివాహ సంప్రదాయాల్లో పాల్గొన్నారు.

ముదిరాజ్ కులాచారం ప్రకారం వరుడు వధువు మెడలో మంగళసూత్రం కట్టడానికి ముందు ఆడపడుచుతో పసుపు కొమ్ము దారంతో మూడు ముళ్లు వేయిస్తారు. ఈ సంప్రదాయాన్ని అనుసరించిన కవిత గౌరీ పూజలో పాల్గొని శివాని మెడలో పసుపు కొమ్ముదారంతో మూడు ముళ్లు వేశారు. అనంతరం ఆమెకు ప్రదానపు ఉంగరం తొడిగి, ఒడిబియ్యం పోసి ఆశీర్వదించారు.

**ఆత్మీయంగా వివాహ వేడుక**

కవిత ఆశీర్వాదాల అనంతరం బాలప్రసాద్ శివాని మెడలో మంగళసూత్రం ధరింపజేశారు. రాజకీయ అనుబంధాలకు అతీతంగా కుటుంబ సభ్యురాలిగా కవిత వివాహ వేడుకలో పాల్గొనడం అక్కడి వారిని ఆకట్టుకుంది. తమ నాయకుడి కోరికను మన్నించి ఇంటి ఆడబిడ్డగా వ్యవహరించిన కవితకు బాలప్రసాద్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# వేద ధర్మ ప్రచార యజ్ఞ మహోత్సవాలు

- **ఆర్య సమాజం, దయానంద గోశాల ఆధ్వర్యంలో వేడుకలు**
- **ఈ నెల 26 నుంచి 30 వరకు నిర్వహణ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 26 (డిడి9 వార్త):**



వేద ధర్మ ప్రచారంలో భాగంగా బోధన్‌లోని ఆర్య సమాజం, దయానంద గోశాల ఆధ్వర్యంలో 'శ్రావణీ ఉపాకర్మ వేద ధర్మ ప్రచార యజ్ఞ మహోత్సవాలు' ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఈ నెల 30 వరకు వేద మంత్రోచ్చారణల నడుమ కొనసాగనున్నాయి. తెనాలికి చెందిన యజ్ఞ బ్రహ్మ పండిత్ శ్రీమాన్ మాధురి కృష్ణమూర్తి పర్యవేక్షణలో ఈ యజ్ఞ ప్రక్రియలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10:30 గంటల వరకు వేద పారాయణము, యజ్ఞము నిర్వహిస్తున్నారు. అలాగే సాయంత్రం 5:30 నుంచి రాత్రి 8 గంటల వరకు యజ్ఞంతో పాటు భక్తులకు వేద ప్రవచనాలు అందించనున్నారు. అనంతరం భక్తులందరికీ సాయంత్రం భోజన ప్రసాద వితరణ ఉంటుంది. ఈ నెల 28 శుక్రవారం శ్రావణ పౌర్ణమి ఉదయం 8 గంటలకు యజ్ఞోపవీతధారణ, విశేష యజ్ఞం, 'ఓం' ధ్వజారోహణం మరియు రక్షాబంధన వేడుకలు నిర్వహించనున్నారు. అదేవిధంగా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరులకు ఈ సందర్భంగా శ్రద్ధాంజలి ఘటించనున్నారు. వేడుకల ముగింపు సందర్భంగా ఆగస్టు 30 ఉదయం 8 గంటల నుంచి సామూహిక యజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమం చేపడతారని ఆర్య సమాజం ప్రతినిధులు తెలిపారు.

# ఏఆర్పీ క్యాంప్ బడి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- **సెప్టెంబరు 6న వేడుకలు**
- **హాజరుకావాలని పూర్వ విద్యార్థుల సంఘం పిలుపు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు26 (డిడి9 వార్త):**

ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 65 సంవత్సరాల ఘనమైన ప్రయాణాన్ని పురస్కరించుకుని పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి సిద్ధమైంది. ఆసియా ఖండంలోనే అతిపెద్ద నిజాం షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, పేద ఉద్యోగుల పిల్లలకు చదువు అందించే లక్ష్యంతో 1959లో ఈ పాఠశాలను నెలకొల్పారు. నాటి నుండి నేటి వరకు గ్రామీణ పేద విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఈ విద్యాలయం కీలక పాత్ర పోషించింది. 1994లో ఎయిడెడ్ పాఠశాలగా, 2001లో పూర్తిస్థాయి ప్రభుత్వ పాఠశాలగా మారిన ఈ బడిలో అత్యధికంగా 26 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించిన స్వర్గీయ మద్దూరి అన్నపూర్ణయ్యతో పాటు వెంకటేశ్వరరావు, ప్రసాద్‌రావు వంటి పలువురు ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన విద్యనందించారు. బ్రాహ్మణపల్లి, వడ్డేపల్లి, జైతాపూర్, కందకుర్తి తదితర పరిసర గ్రామాల పేద విద్యార్థులకు అక్షర వెలుగులు పంచిన ఈ పాఠశాల ప్రాంగణం సమ్మేళనంతో కోలాహలంగా మారనుంది. వచ్చే సెప్టెంబరు 6న ఆదివారం ఉదయం 10 గంటలకు పాఠశాల ప్రాంగణంలో ఈ ఆత్మీయ కలయిక ప్రారంభం కానుంది. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం బ్యాచ్‌ల వారీగా గ్రూప్ ఫోటోలు, చిన్ననాటి జ్ఞాపకాల నెమరువేత కార్యక్రమాలు ఉంటాయి. ఈ అపూర్వ వేడుకకు పూర్వ విద్యార్థులంతా ఏ పనులున్నా వాయిదా వేసుకుని తరలివచ్చి జయప్రదం చేయాలని పూర్వ విద్యార్థుల సంఘం కోరింది.

## నాగారం లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ



**జనగామ ఆగష్టు26(డిడి 9వార్త)బ్యూరో**

లింగాలఘణపురం మండల పరిధిలోని నాగారం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నాగారం గ్రామ లబ్ధిదారులకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కార్డులు అందజేశారు. లబ్ధిదారులు గడిపె సుజాత, దాసరి అంజమ్మ, మిద్దపాక ఏలేంద్ర, కేమిడి నర్సమ్మ, పెద్దగాళ్ల సుశీల తదితరులు కార్డులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అండాలు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, నాగారం కాంగ్రెస్ అధ్యక్షుడు దండు ఉపేందర్, గిరి గణేష్, మండల యువజన నాయకుడు ఎర్ర క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## అడవిలోని ప్రతిమొక్క ఓ ఔషధ భాండాగారమే..!

### సాంప్రదాయ జ్ఞానాన్ని పరిరక్షించుకోవాలి అటవీశాఖ అధికారులు..




**ఆగస్టు26 డిడి9 వార్త వెంకటాపురం.**

అడవి ఆహార పదార్థాలు, ఔషధ మూలికలపై గిరిజన, గ్రామీణ ప్రజల్లో తరత రాలుగా వస్తున్న సాంప్రదాయ జ్ఞానాన్ని సేకరించి డాక్యుమెంటేషన్ చేయాల్సిన అవసరం ఉందని అటవీశాఖ అధికారులు తెలిపారు. కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వెంకటాపురం మండలం తిప్పాపురం పంచాయతీ పరిధిలోని పెంకవాగు గ్రామ కమ్యూనిటీ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎఫ్‌బీవో అశ్విని, ఎఫ్ఎస్ఓ చంద్రమోహన్, సర్పంచ్ చందా శిరీష ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్విని మాట్లాడుతూ అడవుల్లో లభించే ఆకులు, కాయలు, పండ్లు, వేర్లు, గింజలు వంటి సహజ వనరులు గిరిజనుల జీవన విధానంలో ఎంతో ప్రాధాన్యం కలిగి ఉన్నాయని అన్నారు. స్థానికంగా లభించే ఔషధ మొక్కల గుర్తింపు, సేకరణ, వినియోగంపై ప్రజల్లో ఉన్న విలువైన పరిజ్ఞానాన్ని నమోదు చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు అందించవచ్చన్నారు. అటవీ వనరులు, జీవవైవిధ్యం, స్థానిక సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్లు జి. హనుమంత్, జి. కామేష్, యానిమేటర్లు ప్రశాంత్, నరేష్, ఉషా, ఇందిర, పద్మతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన పాతికేళ్ల స్నేహబంధం..

- **చిన్నారి జాహ్నవికి అండగా ఎస్ఎస్‌సీ 2000–2001 బ్యాచ్ స్నేహితులు..**
- **చిన్నారి వైద్యానికి రూ.22,500 ఆర్థిక సాయం..**

**ఆగస్టు26 డిడి9 వార్త వెంకటాపురం.**



అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి జాహ్నవికి ZPSS అలుబాక ఎస్ఎస్‌సీ 2000–2001 బ్యాచ్ స్నేహితులు మానవతా హృదయంతో అండగా నిలిచారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం బెస్తగూడెం గ్రామానికి చెందిన జాహ్నవి వైద్య ఖర్చుల కోసం రూ.22,500 ఆర్థిక సహాయం అందించారు. చిన్నారి అనారోగ్య పరిస్థితిని తెలుసుకున్న బ్యాచ్ స్నేహితులు స్పందించి తమ వంతు సహాయాన్ని అందించడం ద్వారా స్నేహబంధమే కాదు.. సామాజిక బాధ్యత కూడా తమదేనని చాటుకున్నారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన వారి సేవాభావాన్ని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సుంకర సుబ్బరాజు, ఎక్కెల గిరిబాబు, అడబాల నాగేంద్ర, ఎం. ఆశాదేవి, వీరలక్ష్మి, సూర్యకుమారి, కాక గోపాల్, బొగ్గుల లక్ష్మయ్య (టీచర్), గంప బేబీ, సంతోష్ కుమారి, చెన్నం సతీష్, చింత చందర్ రావు, తాటి సర్వేశ్వరావు, జాడి మల్లయ్య, నక్క రాంబాబు, బానారి మల్లయ్య, తోటపల్లి చలపతి, బొల్లె రాము తదితరులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్లు పోగొట్టుకున్న ప్రకటన

**జనగామ ఆగష్టు26(డిడి 9వార్త)బ్యూరో**

నేను, సమ కల్పన, తండ్రి సమ మల్లయ్య, B.Tech రోల్ నం. 117Z1A0590, నల్ల నరసింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యాభ్యాసం చేశాను. నా ఒరిజినల్ TC మరియు బోనఫైడ్ సర్టిఫికెట్లు 01-08-2026న జనగామలో పోగొట్టుకున్నాను. దొరికిన వారు 9550494972కు తెలియజేయ గలరు.

## జీడికే–1 సిహెచ్ పి లో నూతన ఎనర్గో ప్లా ఫీడర్ల ప్రారంభం

- **రాక్ లోడింగ్ సమయం, డామరేజ్ చార్జీలు తగ్గే అవకాశం: ఆర్జీ–1 ఏరియా జీఎం డి. లలిత్ కుమార్**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 26 (డీడీ9 వార్త):**



ఆర్జీ–1 పరిధిలోని జీడీకే-1 సిహెచ్ పి లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎనర్గో ప్లా ఫీడర్లను ఆర్జీ–1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్, జీఎం (ఈ అండ్ ఏం), సిహెచ్ పి ఎస్.వి. రామమూర్తితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమానికి ముందుగా జీడీకే-1 సిహెచ్పి హెచ్ ఓ డి పైడేశ్వర్ ముఖ్య అతిథులకు స్వాగతం పలికి, సిహెచ్ పి లో కొనసాగుతున్న రవాణా, ఇతర కార్య కలాపాల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... నూతనంగా ఏర్పాటు చేసిన ఎనర్గో ప్లా ఫీడర్ల వినియోగంతో భవిష్యత్‌లో రాక్ లోడింగ్ సమయాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. దీంతో డామరేజ్ చార్జీలను కూడా తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నూతన సాంకేతిక పరికరాలను ఉద్యోగులు సమర్థ వంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉత్పత్తి, రవాణా ప్రక్రియల్లో మరింత సామర్థ్యం సాధించ వచ్చని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం నాయకులు మడ్డి ఎల్లయ్య, ఏజీఎం కాశీ విశ్వేశ్వరరావు, రంగు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, పిట్ సెక్రటరీ బండి మల్లేశం, ఈఈ గడ్డం శ్రీనివాస్, ఓఎస్ వేణు, ఫోర్‌మెన్లు రాజేందర్, శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్లు నరేందర్, సతీష్‌కుమార్, ఇతర యూనియన్ నాయకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే అసెంబ్లీ ముట్టడి

- **విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి నియమించాలి: ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 26 (డీడీ9 వార్త):**

విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరించారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమిస్తేనే విద్యార్థుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. బుధవారం గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌లో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు సాయి ఆజాద్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మణికంఠరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 34 నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫల మైందని విమర్శించారు. విద్యార్థినులకు ఇస్తామన్న స్కూటీలు, విద్యార్థులకు ఇస్తామన్న ల్యాప్‌టాప్‌లు, యువ వికాసం కింద రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ఇప్పటికీ ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాకపో వడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని మణికంఠరెడ్డి అన్నారు. సర్టిఫికెట్ల కోసం కళాశాలలకు సొంత డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగానికి బడ్జెట్‌లో కనీసం 15 శాతం నిధులు కేటాయిం చాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం




ఆడకుండా విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సెప్టెంబర్ 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ఒకేసారి విడుదల చేయాలని కోరారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి వద్దే ఉంచుకుని విద్యార్థుల సమస్యలను పరిష్క రించకపోతే ప్రత్యేక మంత్రిని నియమిం చాలని అన్నారు. ప్రభుత్వం స్పందించ కపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని, అవసరమైతే అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తామని మణి కంఠరెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, మామిడిపల్లి హేమంత్, ఎల్కపల్లి సురేష్, లక్ష్మీప్రసన్న, తడిగొప్పుల అనూప్‌సాయి, అభిషేక్, ఆరే జశ్వంత్, గొడిసెల ప్రణీత్, రాహుల్, సూర్యప్రకాశ్, సాయి, మహి, సాయి శరణ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓదెల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి శ్రీకారం

- **రూ.15 కోట్లతో పునర్నిర్మాణం.. భక్తులకు 22 వసతి గృహాల నిర్మాణం**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 26 (డీడీ9 వార్త):**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఓదెల మల్లికార్జున స్వామి దేవస్థానాన్ని దశల వారీగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో దేవాదాయ శాఖ స్థపతితో కలిసి అభివృద్ధి పనులను పరిశీ లించారు. అనంతరం దాతల సహకారంతో నిర్మించనున్న 22 భక్తుల వసతి గృహాల సముదాయానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అంతకుముందు మల్లికార్జున స్వామి ఆలయంలో విజయర మణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ.. ఆలయ పరిసరాల్లో ఇప్పటికే రూ.1.30 కోట్లతో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆలయ పునర్నిర్మా ణానికి సుమారు రూ.15 కోట్లు వెచ్చించ నున్నట్లు పేర్కొన్నారు. దేవాదాయ శాఖ స్థపతితో కలిసి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి పునర్నిర్మాణ పనులకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు.




ఆలయానికి నూతన గోపురాలు, రాతి శిల్పాలతో ప్రాకారం నిర్మించి మరింత సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. పర్యాటక శాఖ నుంచి మరో రూ.8 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరు కానున్నాయని వెల్లడించారు. రానున్న రోజుల్లో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవస రమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటు న్నామని ప్రభుత్వ విప్ తెలిపారు. ఆలయాన్ని దశలవారీగా అభివృద్ధి చేసి ప్రముఖ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, స్థానిక గ్రామ సర్పంచ్, ఈఓ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పలువురు గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ప్రజాప్రతి నిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ. 83 లక్షలతో పలు అభివృద్ధి పనులకి శంకుస్థాపన

- **వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర మంత్రీ వర్యులు సీతక్క**

**తాడ్వాయి డిడి9 వార్త**




తాడ్వాయి మండల కేంద్రంలోనీ ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి అధ్యక్షతన వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో మండల కేంద్రంలోనీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు వివిధ పనుల శంకుస్థాపన పనులకు రూ. 83 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క ఈ సందర్భంగా మంత్రీ సీతక్క మాట్లాడుతూ ములుగు నియోజక వర్గానికి వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు మార్కెట్ యార్డ్ లకు 3 కోట్ల రూపాయలు మంజూరు చేయగా అందులో భాగంగానే తాడ్వాయి మండలానికి 83 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు . వ్యవసాయ రంగానికి ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది అని అన్నారు. రైతులకు ఏకకా లంలోనే 2 లక్షల రుణ మాఫీ చేసింది ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు , త్వరలోనే మండలంలో మరొక యార్డును మంజూరు చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ , తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంకిడి నరసింహా స్వామి , వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సారంగపాణి , కమిటీ బృందం , మాజీ మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్ ముదిరాజ్ , సహకార సంఘం చైర్మన్ పులి సంపత్ గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి జాలపు అనంత రెడ్డి , జిల్లా కార్యదర్శి ఇర్స సునీల్ దొర , సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గడ్డం నాగ భూషణం , సర్పంచులు మొగుళ్ళపల్లి రవీందర్ , కోర్నబెల్లి సావిత్రి , యాప కళా – మోహన్ రావు , మల్లూరు లక్ష్మీ నరసింహ ఆలయ డైరెక్టర్ పల్నాటి సత్యం , ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరిల వెంకన్న , మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముక్తి రామస్వామి , సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చర్ప రవీందర్ , జిల్లా నాయకులు తాండాల శ్రీను , మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గొంది సరిత , యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోడి సతీష్ కుమార్ , కిసాన్ సెల్ మండల అధ్యక్షులు భూషబోయిన రవి కుమార్ , మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శనిగరపు చిరంజీవి , ఆత్మ డైరెక్టర్ మర్రి నరేష్ , వార్డ్ మెంబర్ సభ్యులు బొల్లు నాగేంద్ర కుమార్ , మండల నాయకులు ఆలం సాంబశివరావు , బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్ , ఊరట్టం ఉప సర్పంచ్ కాక రంజిత్ , పులి నర్సయ్య గౌడ్ , వంగరి సదానందం , ఓర్సు రామారావు , ఆలేటి జైపాల్ రెడ్డి , గ్రామ కమిటీ అధ్యక్షులు పాక రాజేందర్ , సిద్ధబోయిన రానా రమేష్ , పాలకుర్తి మధు , మడకం శోభన్ , ఖలీల్ , సింగిల్ విండో డైరెక్టర్లు రంగారబోయిన జగదీష్ , కాయితి లింగాచారి , యానాల సిద్ధి రెడ్డి , బండారి చంద్రయ్య , మహిళా నాయకురాలు ముంద్రాతి రాజశ్రీ , నాగమణి , మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గజ్జల రాజశేఖర్ , యూత్ కాంగ్రెస్ నాయకులు , తదితరులు పాల్గొన్నారు

# ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

- **సుందిళ్ల బ్యారేజీ నుంచి రామగుండం వరకు 5 కి.మీ. కరకట్ట నిర్మించాలి**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 26 (డీడీ9 వార్త):**



గోదావరి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంగా సుందిళ్ల బ్యారేజీ నుంచి రామగుండం వరకు 5 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం రామగుండం మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గోదావరి నది పరివాహక ప్రాంతం ఉండటంతో భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. మేడిపల్లి, మల్కాపురం, సప్తగిరి కాలనీ, ఉదయ్‌నగర్, రెడ్డి కాలనీ, ప్రశాంత్‌నగర్, శ్రీనగర్ కాలనీ, గంగానగర్, పవర్‌హౌస్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు వరదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటి విడుదల, భారీ వర్షాల కారణంగా గోదావరి బ్రిడ్జి వద్ద నీటిమట్టం పెరిగి రాకపోకలు సైతం నిలిచి పోతున్నాయని తెలిపారు. గత పాలకులు ముంపు నివారణకు కరకట్ట నిర్మిస్తామని పలుమార్లు హామీలు ఇచ్చారని, ఒకసారి రూ.130 కోట్లు, మరోసారి రూ.200 కోట్లు, ఇంకోసారి రూ.400 కోట్లు ఖర్చవుతుందని ప్రకటించినా ఆచరణలోకి రాలేదని అన్నారు.

**కరకట్టతో పలు ప్రయోజనాలు**

సుందిళ్ల బ్యారేజీ నుంచి రామగుండం వరకు కరకట్ట నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేపట్టి, సమగ్ర అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని దినేష్ కోరారు. కరకట్ట నిర్మాణం పూర్తయితే ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు గోదావరి తీర ప్రాంతం సుందరీకరణకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించడంతో పాటు గోదావరి తీర ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి భూసేకరణ, అంచనాల తయారీ ప్రక్రియను ప్రారంభించి 5 కి.మీ. కరకట్ట నిర్మాణ పనులు చేపట్టాలని మద్దెల దినేష్ డిమాండ్ చేశారు.

# రాఖీ కేవలం దారం కాదు.. రక్షణకు ప్రతీక





- **ఓసీపీ–3 సింగరేణి కార్మికులకు రాఖీలు కట్టిన కందుల సంధ్యారాణి**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 26 (డీడీ9 వార్త):**

రాఖీ పౌర్ణమి సందర్భంగా ఓసీపీ–3 సింగరేణి కార్మికులకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. 8 ఇంక్లైన్ లైన్ కాలనీ మండల అధ్యక్షుడు ఆకుల శశి ఆధ్వర్యంలో నిర్వహించిన రాఖీ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు రాఖీలు కట్టి కుటుంబ సభ్యుల మాదిరిగా ఆత్మీయతను పంచుకున్నారు. సంధ్యారాణి మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధం, పరస్పర ప్రేమ, విశ్వాసం, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. రాఖీ కేవలం ఒక దారం కాదని, ఆప్యాయత, బాధ్యత, రక్షణకు ప్రతీకగా నిలిచే పవిత్ర బంధమని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు భూమి పొరల్లోకి వెళ్లి బొగ్గును వెలికితీస్తూ దేశానికి వెలుగునందిస్తున్నారని కొనియాడారు. కార్మికులు విధుల కోసం గనుల్లోకి వెళ్లిన ప్రతిసారీ వారు క్షేమంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతుంటారని, అయినప్పటికీ దేశం, సమాజం కోసం నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తున్న వారి సేవలు అమూల్యమైనవని అన్నారు. కార్మికుల చేతికి కట్టే ఈ రాఖీ అక్కాచెల్లెళ్ల ఆత్మీయతకు గుర్తుగా, వారు ఎల్లప్పుడూ సురక్షితంగా ఉండాలని కోరుకునే మా ఆకాంక్షకు ప్రతీక" అని సంధ్యారాణి అన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, భద్రత కోసం బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు మూకిరి రాజు, లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, బీఎంఎస్ నాయకుడు గట్టు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి ఆకుల కుమార్‌గౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు ఐలవేణి అనిల్‌కుమార్, జంజర్ల శ్రీనివాస్, లింగం నాయక్, గంధం శంకర్, దూడపాక కుమార్, లింగాల శంకర్, జక్కుల పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక కిచెన్ సరే.. కార్మికుల ఉపాధి సంగతేంటి!!!

- **మధ్యాహ్న భోజన కార్మికుల ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి: ఏఐటీయూసీ**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 26 (డీడీ9 వార్త):**




గంటకు 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు తయారు చేసే ఆధునిక కిచెన్ టెక్నాలజీని ప్రభుత్వం ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే సాంకేతికత పేరుతో మధ్యాహ్న భోజన కార్మికుల ఉపాధికి భంగం కలిగిస్తే ఉద్యమాలు తప్పవని ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి సునీల్ స్పష్టం చేశారు. మంథని మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన అధునాతన కిచెన్ నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా కదారి సునీల్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అధునాతన పరికరాలు అందుబాటులోకి రావడాన్ని ఏఐటీయూసీ స్వాగతిస్తుందని తెలిపారు. యంత్రాలు రావడంలో తప్పులేదని, అయితే వాటి పేరుతో ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకాన్ని నమ్ముకుని జీవిస్తున్న కార్మికుల కడుపు కొట్టడం మాత్రం సహించేది లేదని అన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను ఉపాధి నుంచి తప్పించేందుకు ప్రభుత్వం అక్షయ ఫౌండేషన్‌తో రహస్య ఒప్పందం చేసుకుందనే అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను ఇంటికి పంపడమే ప్రభుత్వ విధానమా? అని ప్రశ్నించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ఉద్యోగ, ఉపాధి భద్రతపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కదారి సునీల్ కోరారు. ఆధునిక టెక్నాలజీ పేరుతో కార్మికుల జీవనోపాధితో చెలగాటం ఆడొద్దని సూచించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోతే మధ్యాహ్న భోజన కార్మికుల ఉపాధి భద్రత కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్మిక సంఘాలతో ఐక్య పోరాటాలకు రూపకల్పన చేసి సమరశీల ఉద్యమాలను నిర్వహిస్తామని తెలిపారు.

# ఎస్ఐఆర్‌పై నిర్వహించే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

- **ప్రతి ఓటరు ఓటరు జాబితాను పరిశీలించి అభ్యంతరాలు, సూచనలు తెలియజేయాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 26(డిడి9 వార్త):**



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కామారెడ్డి నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలోని గ్రామాల్లో గురువారం, ఆగస్టు 27న గ్రామ సభలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయడమే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.గ్రామ సభల్లో ముసాయిదా ఓటరు జాబితాను బహిరంగంగా చదివి వినిపించడంతో పాటు, జాబితాలోని వివరాలను ప్రజలకు తెలియజేస్తారని తెలిపారు.మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, నివాసం మారిన ఓటర్ల వివరాలు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓటర్ల వివరాలు, గైర్హాజరైన ఓటర్ల జాబితాలను కూడా గ్రామ సభల్లో చదివి వినిపిస్తారని తెలిపారు.ప్రతి ఓటరు, గ్రామ ప్రజలు తప్పనిసరిగా గ్రామ సభలకు హాజరై ఓటరు జాబితాను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. తమ పేరు, చిరునామా లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉన్నా, పేరు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.గ్రామ సభల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది తదితర అధికారులు పాల్గొంటారని తెలిపారు.నోటీసుల జారీ, విచారణ ప్రక్రియ, అభ్యంతరాల నమోదు, పరిష్కార విధానం తదితర అంశాలపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.జుక్కల్ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నిర్వహించే గ్రామ సభలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితా సక్రమంగా ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో కీలకమని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అనర్హులు మరియు పునరావృత నమోదులను గుర్తించేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కీలకమని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు.ఈ నేపథ్యంలో ఆగస్టు 27న నిర్వహించే గ్రామ సభలకు ప్రజలు తప్పనిసరిగా హాజరై ఓటరు జాబితాను పరిశీలించి తమ అభ్యంతరాలు, సూచనలు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

## హైదరాబాద్ జిల్లా కమిటీకి నూతన బాధ్యులు



**జనగామ ఆగస్టు 26(డిడి 9వార్త)బ్యూరో**

తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి హైదరాబాద్ జిల్లా కమిటీని విస్తరించింది. నల్లకుంట శతాబ్ది భవన్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, రజక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరాజు రాజేష్‌కుమార్ వనపర్తి సమక్షంలో నూతన నియామకాలు చేపట్టారు. జిల్లా కార్యదర్శిగా తిప్పరాజు కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సీహెచ్. రాకేష్, యువజన అధ్యక్షుడిగా సీహెచ్. బాలకృష్ణ, అంబర్‌పేట అధ్యక్షుడిగా సోమరాజు రాజు నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు కొండ్రాతి రమేష్‌తో కలిసి గోపి రజక వారికి నియామక పత్రాలు అందజేశారు. నూతన బాధ్యులు సంఘం బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

## వాట్సాప్ మెసేజ్ చూసి వెంటనే స్పందించి..

- **బాలుని ప్రాణాలు కాపాడిన గద్దల రామకృష్ణ...**
- **అభినందనలు తెలుపుతున్న గిరిజన ప్రాంత ప్రజలు**
- **29వ సారి రక్తదానం చేసి.. యువతకు ఆదర్శంగా నిలిచిన బీఆర్ఎస్ యువజన నాయకుడు రామకృష్ణ.**



**మణుగూరు.ఆగస్టు 26(డి డి 9వార్త)**

"రక్తదానం అంటే కేవలం రక్తం ఇవ్వడం కాదు.. ఒక ప్రాణానికి మరో అవకాశం ఇవ్వడం!" అనే మాటలను నిజం చేస్తూ బీఆర్ఎస్ యువజన నాయకుడు గద్దల రామకృష్ణ మానవత్వాన్ని చాటుకున్నారు.మామిళ్ళ వాయి మారుమూల గిరిజన ప్రాంతానికి చెందిన ఏడేళ్ల బాలుడికి అత్యవసరంగా రక్తం అవసరం అంటూ వాట్సాప్ గ్రూపులో వచ్చిన సందేశాన్ని చూసిన రామకృష్ణ ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించారు. భద్రాచలంలోని రవి హాస్పిటల్‌కు వెళ్లి రక్తదానం చేసి బాలుడి ప్రాణాలను కాపాడేందుకు తన వంతు సహాయం అందించారు. ఇది రామకృష్ణ చేసిన 29వ రక్తదానం కావడం విశేషం. అవసరమైన సమయంలో స్పందించి తన రక్తాన్ని అందించడం ద్వారా ఆయన మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. విషయం తెలుసుకున్న మండల ప్రజలు, యువత రామకృష్ణను అభినందిస్తున్నారు. "మన రక్తంలో కొంత భాగం పోతుంది.. కానీ ఎవరో ఒకరి జీవితంలో ఆశ మిగులుతుంది." "మీరు ఇచ్చే రక్తం మీకు చిన్న త్యాగం కావచ్చు.. కానీ ఆ రక్తం కోసం ఎదురుచూస్తున్న కుటుంబానికి అది ఒక జీవితకాలం విలువైన బహుమతి." 29వ సారి రక్తదానం చేసిన రామకృష్ణను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు వచ్చి అత్యవసర సమయాల్లో రక్తదానం చేయాలని పలువురు కోరుతున్నారు. "ఒక్క యూనిట్ రక్తం.. ఒక కుటుంబానికి చిరునవ్వు! రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి. మీ రక్తం.. మరొకరి జీవితం" అని యువతకు సందేశం ఇస్తున్న రామకృష్ణ ధన్యుడు!

## ఓటర్లూ... జాబితా సరిచూసుకోండి : ఆర్డీఓ, ఈఆర్ ఓ విజయకుమారి

### ఓటర్ల జాబితా సవరణకు నేడే గ్రామసభలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు26 (డిడి9 వార్త):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ, ఈఆర్ఓ విజయ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల జాబితాను ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకంగా రూపొందించడమే లక్ష్యంగా ఈ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సభల్లో డ్రాఫ్ట్ ఓటరు జాబితాను బహిరంగంగా చదివి వినిపిస్తారన్నారు. మరణించిన వారి పేర్ల తొలగింపు, నివాసం మారిన వారు, డబుల్ ఎంట్రీలు, మార్పులు–చేర్పులపై ప్రజలు అక్కడికక్కడే అధికారులకు విజ్ఞప్తులు సమర్పించవచ్చని సూచించారు. బిఎల్ఓలు, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది ఈ సభల్లో అందుబాటులో ఉంటారని, ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## భీంగల్ పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కాపు కుమ్మరి హరీష్

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు26 (డిడి9 వార్త) :**

బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని భీంగల్ పట్టణ కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యదర్శిగా కాపు కుమ్మరి హరీష్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని, శ్రేణులతో కలిసి క్రమశిక్షణతో ముందడుగు వేస్తానని హరీష్ స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విజయం దిశగా నడిపించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భీంగల్ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఏ సమస్యనైనా తన దృష్టికి తీసుకువస్తే, ఉన్నతాధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన నియామకానికి సహకరించిన భీంగల్ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు పర్సా అనంతరావు, భీంగల్ మున్సిపల్ చైర్మన్ బోదిరె నాగమణి స్వామి, నాయకుడు కన్నె సురేందర్‌లతో పాటు ఎల్లవేళలా ప్రోత్సహిస్తున్న తోటి కార్యకర్తలకు, అభిమానులకు హరీష్ కృతజ్ఞతలు తెలిపారు.

## వనమహోత్సవం సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మొక్కలను నాటిన అధికారులు.



**మణుగూరు.ఆగస్టు 26(డి డి 9వార్త)**

మణుగూరు మండలం, గుట్టమల్లారం రైతువేదికలో వనమహోత్సవం సందర్భంగా బుధవారం నాడు మొక్కల నాటే కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మణుగూరు బి. తాతారావు, ఏఓ వి. రాహుల్ రెడ్డి, హెచ్ఓ సాయి కృష్ణ, ఏఈఓ డా. కొమరం లక్ష్మణ్ రావు, ఆత్మ చైర్మన్ అవుల సర్వేశ్వర రావు, ఆత్మ డైరెక్టర్ కుర్రి చలపతి రావు, గుట్టమల్లారం సర్పంచ్ కారం పూజ, ఉపసర్పంచ్ కొమరం మధుకిరణ్ పాల్గొన్నారు.అలాగే రైతులు కొండ్రు మల్లేష్, బత్తుల శ్రీనివాసరావు, దొడ్డపనేని మధు తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్క నాటడం మాత్రమే కాకుండా, దాని సంరక్షణ కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

## సుభాష్ నగర్ లో పోలీసుల కార్డన్ సెర్చ్

### 262 ఇళ్ల తనిఖీ, 82 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

### నేరాల నియంత్రణే లక్ష్యం.. కాలనీలో పోలీసుల విస్తృత తనిఖీలు -- డీఎస్పీ యం అరుణ్ కుమార్



**భద్రాచలం, ఆగస్టు 26 (డిడి9 వార్త )**

భద్రాచలం పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో పోలీసులు బుధవారం తెల్లవారు జామున కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. కాలనీలోని 262 ఇళ్లను తనిఖీ చేసి అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సందర్భంగా వాహనాలను విస్తృతంగా తనిఖీ చేయగా సరైన ధ్రువపత్రాలు లేని, పెండింగ్ చలాన్లు ఉన్న 82 ద్విచక్ర వాహనాలను గుర్తించారు. పెండింగ్ చలాన్లను వసూలు చేయడంతో పాటు సరైన నంబర్ ప్లేట్లు లేని వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. అనంతరం డీఎస్పీ అరుణ్ కుమార్ కాలనీవాసులతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను సక్రమంగా కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గంజాయి వినియోగం, విక్రయాలు, అక్రమ రవాణా వంటి మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. గంజాయికి బానిసైన వారి వివరాలను పోలీసుల దృష్టికి తీసుకువస్తే డీ–అడిక్షన్ కేంద్రాలకు పంపించి పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తులకు ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో వారి పూర్తి వివరాలను తెలుసుకుని తగిన ధ్రువీకరణ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సీఐ నాగరాజు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, సీఆర్ పీఎఫ్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## తగిలేపల్లి మాజీ సర్పంచ్ హత్య ఘటనపై చట్టపరమైన విచారణ జరపాలి



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు26 (డిడి9 వార్త):**

వర్ని మండలం తగిలేపల్లి మాజీ సర్పంచ్ వెంకటేశ్ హత్య ఘటనను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ ఘటనను అడ్డం పెట్టుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ డీసీసీబీ మాజీ అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బుధవారం బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... హత్య ఘటనతో ఎలాంటి సంబంధం లేకపోయినప్పటికీ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌పై భాస్కర్‌రెడ్డి అనుచిత విమర్శలు చేస్తూ, దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని ఖండించారు. నిజమైన నిందితులెవరో సమగ్ర విచారణలో తేలాల్సి ఉందన్నారు. సున్నితమైన అంశంలో ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న భాస్కర్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు జుబేర్, అంజిరెడ్డి, బీర్కూర్ సర్పంచ్ ధర్మతేజ, తెల్ల రవికుమార్ తదితరులు ఉన్నారు.

# కెసిఆర్ ని ముఖ్యమంత్రిని చేసేవరకు ప్రతి BRS సైనికుడు కసిగా పని చెయ్యాలి





### మెచ్చా...

- **కష్టపడి పని చేసేవారిని పార్టీ ఎప్పటికీ మర్చిపోదు - మెచ్చా..**
- **అక్రమ కేసులకు BRS భయపడదు...**
- **మండలంలో మెచ్చా పర్యటనతో పార్టీ నాయకుల్లో నూతన జోష్..**

**అశ్వరావుపేట:ఆగస్టు 26 ( డిడి 9 వార్త)**

చంద్రుగొండ మండలంలో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ★ పర్యటనతో పార్టీ నాయకుల్లో నూతన జోష్ వచ్చింది.ప్రతి ఒకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ ఆత్మీయంగా మాట్లాడుతూ పర్యటన కొనసాగింది.అయ్యప్పస్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మద్దుకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన బిఆర్ఎస్ పార్టీ దిమ్మపై పార్టీ జెండాను ఎగరవేసి దిమ్మను ఆవిష్కరించారు.అనంతరం గ్రామ పార్టీ కార్యాలయ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు.అలాగే గ్రామ పార్టీ కార్యాలయ ఏర్పాటు కొరకు స్థలం ఇచ్చిన మంచినేని వెంకటేశ్వరరావు గారిని శాలువాతో సత్కరించారు. చంద్రుగొండ మండల కేంద్రంలో కుక్కడపు ఉపేందర్ రావు – స్వాతి దంపతుల కుమారుడు సాయి నిఖిల్ వివాహ వేడుకలో మరియు సోమనపల్లి నాగేశ్వరరావు – పద్మ కుమారి దంపతుల కుమారుడి వివాహ వేడుకలలో పాల్గొన్నారు రావికంపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన బిఆర్ఎస్ పార్టీ దిమ్మపై పార్టీ జెండాను ఎగరవేసి దిమ్మను ఆవిష్కరించారు. దామరచర్ల గ్రామంలో షేక్ నాగుల్ మీరా ఉదయం గుండెపోటుతో మృతి చెందగా వారి పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మళ్ళీ కేసీఆర్ గారిని ముఖ్యమంత్రిని చేసే వరకు ప్రతి ఒక్కరూ కసిగా పని చెయ్యాలని. కష్టపడి పని చేస్తున్న ఏ ఒక్కరిని పార్టీ మర్చిపోదని.ప్రతి ఒకరిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఏ క్షణం రామన్న వస్తానని హామీ ఇచ్చారు.గ్రామాలు అభివృద్ధి అవ్వాలంటే కెసిఆర్ మళ్ళీ రావాలని గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారని.అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రతి ఒకరిని మోసం చేసిందని.రేపు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు బాకీ కార్డులతో గ్రామాల్లో ప్రజలకు కాంగ్రెస్ చేసిన మోసాలను వివరించే కార్యక్రమం చేపట్టాలని కెటిఆర్ గారు పిలుపు ఇచ్చిన సందర్భంగా నాయకులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని వారు చేసిన మోసాలను ప్రజలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.పార్టీ ఇచ్చే ప్రతి పిలుపును మరియు పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కష్టపడుతున్న జిల్లా BRS పార్టీ మాజీ అధ్యక్షులు రేగ కాంతారావు ని రాజకీయంగా ఎదుర్కోలేక వారి ప్రతిష్ఠను దిగజార్చాలనే దుర్మార్గపు ఆలోచనతో అబద్ధపు కేసు పెడితే.న్యాయస్థానం అది అబద్ధపు కేసని కొట్టేసిందని.నిజం ఎప్పటికీ గెలుస్తుందని.ఎన్ని ఇబ్బందులు పెట్టాలని చూసినా రేపు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రేగ కాంతారావు నాయకత్వంలో 5 నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని దీమ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు దారా బాబు,బోయినపల్లి సుధాకర్ రావు,మాజీ ZPTC వెంకట రెడ్డి,సర్పంచ్ లు కృష్ణ కుమారి, గూగులోత్ ప్రవీణ్ ప్రకాష్, మాజీ సర్పంచ్లు పుసం వెంకటేశ్వర్లు,పండ్ల అంజన్ రావు,ఉప సర్పంచులు బానోత్ బాలు,శీలం రమేష్ రెడ్డి,శ్రవణ్ కుమార్,నల్లమోతు వెంకట నారాయణ,మేడ మోహన్ రావు,కొత్తూరు వెంకటేశ్వరరావు, భూపతి రమేష్,ఉన్నం నాగరాజు,ఉగ్గం శ్రీను,గానుగపాడు వైస్ చైర్మన్ భూపతి ధన లక్ష్మీ,భూపతి శ్రీను,శారద,అశ్విని,కనకమలక్ష్మీ,కంపాటి రాధమ్మ, బీరకాయల వెంకటేశ్వర్లు, మద్దిరాల చిన్న పిచ్చయ్య, సానిక మల్లేష్,పొట్రు అప్పారావు,ఆదిమల్ల సత్యనారాయణ, చల్లా రాంబాబు,కెలోత్ శ్రీను,చాపలమడుగు రామరాజు,బాద్షా,హనుమంత్ రావు,పొట్రు మధు,ఉప్పతల గణేష్,బానోత్ రాజ్ కుమార్,పల్లె వీరప్రసాద్, తాళ్లా వెంకట రత్నం,గాంధీ, పద్దం కృష్ణ,నరసింహా రావు,మహేష్,కంపాటి అశోక్,ఓరుగంటి శ్రీను,పండ్ల కిరణ్, కోడెం రాంబాబు,మంద అనిల్,రమేష్,కుక్కల రంగయ్య,గాలం రవి,బుద్దేశ్వరరావు,వెంకటేశ్వరరావు, మాచిని సురేష్, రమేష్, ముత్యం,రామకృష్ణ,అబ్బాస్ అలీ,ముత్తయ్య, సయ్యద్ హుస్సేన్,సయ్యద్ పాషా,రాధాకృష్ణ,భుక్య అధ్య,భూక్యా వెంకటేష్,బాధవత్ వెంకటేష్,భూక్యా బద్రు, అల్లభాగత్, కరిముల్లా, సైదా, జాన్ పాషా, ఆసిఫ్, నాగుల్ మీరా,కలిశా, రఫీ,అశోక్, సాదిక్, జాఫర్, గాలం రవి,ఇమ్మడి ముత్తేశ్వరరావు,తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

### 1976 నుండి 2026 వరకు 50 ఏళ్లుగా

# ఆదివాసుల రిజర్వేషన్లలను దోసుకుంటున్న లంబాడీలు

- **మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల సాక్షిగా యుద్ధం మొదలు అయింది**
- **సెప్టెంబర్ 7న ఏటూరు నాగారం ఐటీడీఏ కేసీఆర్ కేంద్రంలో ఆదివాసీ మార్చ్ కి వేలాదిగా కదిలి రండి**
- **పోస్టర్ కరపత్రం ఆవిష్కరణ**
- **తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా.అరుణ్ కుమార్ జాతీయ ఉపాధ్యక్షులు పొడెం బాబు**

**తాడ్వాయి డిడి9 వార్త**







ఆదివాసీ పోరాట సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యం లో రాష్ట్ర వ్యాప్త ఐటీడీఏ కేంద్రాలలో బారి "ఆదివాసి మార్చ్" కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతం చేయాలని నేడు కర పత్రం పోస్టర్ ఆవిష్కరణ సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణం మేడారంలో చేయటం జరిగింది. సెప్టెంబర్ – 7 ఏటూరు నాగారం సెప్టెంబర్ – 16 ఉట్నూర్ సెప్టెంబర్ – 21 భద్రాచలం సెప్టెంబర్ – 28 మన్ననూరులలో అధివాసి మార్చ్ ల నిర్వహణ చేయనున్నట్లు తుడుందెబ్బ తెలిపింది. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు డా.మైపతి అరుణ్ కుమార్ జాతీయ ఉపాధ్యక్షులు పోడెం బాబు రాష్ట్ర కార్యదర్శి కోరగట్ల లక్ష్మన్ ASU రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోర్నిబెల్లి గణేష్ లు ముఖ్య అధితులుగా హాజరయినారు అనంతరం డా.అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదివాసీల మనుగడ దిన దిన గండంగా మారింది అని ఎన్ని ర్యాలీలు బహిరంగ సభలు నిర్వహణ చేసి ఆదివాసీల సమస్యలను విన్నవించినా కానీ రాష్ట్ర ప్రభుత్వం దున్న పోతు మీద వర్షం పడ్డ చందంగా వ్యవహరిస్తుంది అన్నారు అందుకే పోరాటాలు ఉధృతం చేయటం కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమాల కు పిలుపు ఇచ్చాం అన్నారు 1976 నుండి 2026 వరకు 50 ఏళ్లుగా ఆదివాసీల రిజర్వేషన్ లను దోచుకుంటున్న లంబాడిలను ఎస్టీల నుండి తొలగించటం కోసం ప్రత్యేక కమిషన్ ను నియమించాలని "5"వ షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాలలో 29 శాఖల జీవోలను ట్రైబల్ అడ్వసరి కమిటీ తీర్మానం ద్వారా ప్రత్యేక చట్టం చేయాలని, ఐటీడీఏ ద్వారనే ఉద్యోగ బర్తీ ప్రక్రియ ప్రమోషన్ లు బదిలీలు చేయాలనీ కానిస్టేబుల్ ఉద్యోగాలలో 75 శాతం వాట ఏజెన్సీ DSC ఏర్పాటు, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి గిరి వికాస్ బోర్లు దింపాలనీ గోదావరి నది పై కట్టిన ప్రాజెక్ట్ లలో తుపాకులగూడెం దేవాదుల కాళేశ్వరం నుండి ఆదివాసీ ప్రాంత రైతులకు సాగు నీరు ఇవ్వాలని BTPS,KTPS,BPL సింగరేణిలలో అధివాసిల వాట మరియు ఉద్యోగాల వాట, డి సీల్టింగ్ పేరిట నిబంధనల కు విరుద్ధంగా అక్రమ ఇసుక త్రవ్వకం తదితర డిమాండ్ లతో ఈమార్చ్ నిర్వహణ చేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం కోటేశ్వరరావు మండల అధ్యక్షులు మోకాళ్ళ వెంకటేష్ మేడారం అధ్యక్షులు గడిగ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# పినపాక అభివృద్ధికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వినతి

- **రోడ్లు, వంతెనల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి.**

**మణుగూరు.ఆగస్టు 26 (డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి, రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు పరిపాలనా అనుమతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, వికలాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు

నియోజకవర్గంలోని మారుమూల, గిరిజన ప్రాంతాల్లో రహదారులు, వంతెనల సౌకర్యాలు సరిగా లేక ప్రజలు, రైతులు, విద్యార్థులు, రోగులు రవాణా విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పినపాక నియోజకవర్గంలోని మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, కరకగూడెం, పినపాక, అల్లపల్లి, గుండాల మండలాల్లో ప్రజలకు అవసరమైన పలు బీటీ రోడ్లు, హై లెవల్ వంతెనల నిర్మాణ పనులను చేపట్టాల్సి ఉందన్నారు. ఈ పనులకు ప్రభుత్వం త్వరితగతిన పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, అవసరమైన నిధులు విడుదల చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. రోడ్లు,వంతెనల నిర్మాణంతో మారుమూల గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడటంతో పాటు రైతులు పంటలను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు విద్యాసంస్థలకు వెళ్లేందుకు, అత్యవసర సమయాల్లో రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పినపాక నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన మౌలిక వసతులు కల్పించి, ప్రజల రవాణా సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.

# ప్రజా పాలన పేరుతో నయవంచక పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మీ తాటాకు చప్పళ్లకు భయపడే ప్రసక్తే లేదు
- సమయం వచ్చినప్పుడు అందరి లెక్కలు తేలుస్తాం
- మా పాలన అభివృద్ధి.. మీ పాలన అభివృద్ధిపై గుండాల బొడ్రాయి సెంటర్‌లో చర్చకు సిద్ధమా?



**గుండాల ఆగస్టు 26 డిడి 9 వార్త :**

ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ నయవంచక పాలన సాగిస్తోందని గుండాల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తెల్లం భాస్కర్, పార్టీ సీనియర్ నాయకులు మోకాళ్ల వీరస్వామి, గడ్డం వీరన్న తీవ్రంగా ఆరోపించారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం, రాజకీయ ఆరోపణలు చేయడం, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. బుధవారం గుండాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటుతున్నా ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఆ హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రతిపక్ష నాయకులపై ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే అది సాధ్యం కాదని వారు స్పష్టం చేశారు. "మీ తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదు.. కేసులు, బెదిరింపులు, అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేసే రాజకీయాలను చూసి వెనక్కి తగ్గే నాయకులు బీఆర్ఎస్‌లో లేరు" అని హెచ్చరించారు. ప్రజల కోసం, తెలంగాణ అభివృద్ధి కోసం పోరాడిన పార్టీగా బీఆర్ఎస్‌కు బలమైన కార్యకర్తల వ్యవస్థ ఉందని పేర్కొన్నారు.

**రేగా కాంతారావుపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపణ**

పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వారు మండిపడ్డారు. రేగా కాంతారావు అక్రమ ఆస్తులు సంపాదించారని, అక్రమంగా ఆస్తులు కూడబెట్టారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారని, ఆరోపణలు నిజమైతే వాటిని నిరూపించాల్సిన బాధ్యత కూడా వారిపైనే ఉందని అన్నారు. రేగా కాంతారావుపై చేసిన ఆరోపణలను నిరూపించాలని ఆయన స్వయంగా సవాల్ విసిరి మణుగూరు అంబేద్కర్ సెంటర్ వద్ద వేచి ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కడికి వచ్చి తమ ఆరోపణలను నిరూపించలేకపోయారని వారు ఎద్దేవా చేశారు. అక్కడికి వచ్చి వాస్తవాలను ప్రజల ముందు ఉంచకుండా మండల కేంద్రాల్లో ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. "అక్రమ ఆస్తులు ఉన్నాయని ఆరోపిస్తున్నారు.. అక్రమ సంపాదన ఉందని చెబుతున్నారు.. రాష్ట్రంలో ప్రభుత్వం మీ చేతుల్లోనే ఉంది. ముఖ్యమంత్రి మీరే.. మంత్రులు మీరే.. ప్రభుత్వ యంత్రాంగం మీ చేతుల్లోనే ఉంది. ఆరోపణలు నిజమైతే అధికారులతో విచారణ చేయించండి.. ఆధారాలు సేకరించండి.. చట్ట ప్రకారం చర్యలు తీసుకోండి. అంతే తప్ప ఆధారాలు లేకుండా రాజకీయ ఆరోపణలు చేసి ప్రజలను ఎందుకు తప్పుదోవ పట్టిస్తున్నారు?" అని వారు ప్రశ్నించారు. రేగా కాంతారావుపై నమోదైన కేసులు హైకోర్టులో నిలవలేదని వారు పేర్కొంటూ, ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయని అన్నారు.

**బీఆర్ఎస్ పాలనలో ఎవరినీ రాజకీయంగా వేధించలేదు**

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన సమయంలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన కార్యకర్తలను రాజకీయ కక్షతో ఇబ్బందులకు గురిచేయలేదని వారు అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అనేక మంది నాయకులు, కార్యకర్తలు స్వేచ్ఛగా రాజకీయ కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేశారు. "ఆ రోజుల్లో మేము కన్నెర్ర చేసి ఉంటే గుండాల మండలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తమ ఇళ్లలో ప్రశాంతంగా నిద్రపోయేవారా? కానీ మేము అలా చేయలేదు. రాజకీయాలు వేరు.. వ్యక్తిగత కక్షలు వేరు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలందరినీ సమానంగా చూడాలనే రాజకీయ సంస్కృతి బీఆర్ఎస్‌ది" అని వారు అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష నాయకులను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తోందని ఆరోపించారు. కేసులు పెట్టడం, విచారణల పేరుతో వేధించడం, వ్యక్తిగత ఆరోపణలు చేయడం ద్వారా బీఆర్ఎస్ నాయకులను భయపెట్టలేరని స్పష్టం చేశారు.

**ఆరు గ్యారెంటీలపై ప్రజలకు సమాధానం చెప్పాలి**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు, పేదలు, వృద్ధులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని అన్నారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు, ఉద్యోగ అవకాశాలు, రైతుల సమస్యలు, విద్య, వైద్యం, రోడ్లు, తాగునీరు, సాగునీరు వంటి మౌలిక సమస్యలపై ప్రభుత్వం సమగ్రంగా దృష్టి సారించాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా ప్రతిపక్ష నాయకులపై విమర్శలు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. "ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయండి.. అభివృద్ధి పనులు చేయండి.. ప్రజలకు సమాధానం చెప్పండి. ప్రతిపక్ష నాయకులపై ఆరోపణలు చేయడం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం కావు" అని హితవు పలికారు.

**అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?**

గుండాల మండల అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ నాయకులు బహిరంగ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు చేసిన అభివృద్ధి, ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి పనులపై గుండాల బొడ్రాయి సెంటర్‌లో బహిరంగ చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. "మా పాలనలో గుండాల నియోజకవర్గంలో, మండలంలో జరిగిన అభివృద్ధి ఏమిటో మేము చెప్పడానికి సిద్ధంగా ఉన్నాం. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధి ఏమిటో మీరు చెప్పండి. ప్రజల ముందు కూర్చొని చర్చిద్దాం. ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజలే నిర్ణయిస్తారు" అని సవాల్ విసిరారు. అభివృద్ధి విషయంలో తమకు ఎలాంటి భయం లేదని, ప్రజల ముందు వాస్తవాలను ఉంచేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. గుండాల మండలంలోని ప్రతి గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించడానికి తాము సిద్ధమని తెలిపారు.

**తాటాకు చప్పళ్లకు భయపడేది లేదు**

కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలు, ఆరోపణలు, బెదిరింపులకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదని వారు అన్నారు. రాజకీయంగా ఎదుర్కోవాల్సి వస్తే రాజకీయంగానే ఎదుర్కొంటామని, ప్రజా సమస్యలపై అవసరమైతే ప్రజలతో కలిసి ఉద్యమాలు చేపడతామని తెలిపారు. "అధికారం శాశ్వతం కాదు.. పదవులు శాశ్వతం కాదు.. ప్రజలే శాశ్వతం. ఈరోజు అధికారం మీ చేతుల్లో ఉండొచ్చు.. రేపు పరిస్థితులు మారవచ్చు. సమయం వచ్చినప్పుడు ప్రజల ముందే అందరి లెక్కలు తేలుస్తాం" అని వారు అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలను అణచివేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో అధికార పక్షం ఎంత ముఖ్యమో ప్రతిపక్షం కూడా అంతే ముఖ్యమని, ప్రతిపక్ష గొంతును అణచివేయడం ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించలేరని పేర్కొన్నారు.

**ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు మానుకోవాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా రాజకీయ ఆరోపణలు, తప్పుడు కేసులు, వ్యక్తిగత విమర్శలు పక్కనపెట్టి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ నాయకులు సూచించారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. గుండాల మండలంలో తాగునీరు, రోడ్లు, విద్య, వైద్యం, రైతుల సమస్యలు, సాగునీరు, విద్యుత్, నిరుద్యోగం వంటి అనేక సమస్యలు ఉన్నాయని, వాటిపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. "ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు.. రాజకీయ కక్షలను కాదు. ప్రజలకు ఉద్యోగాలు కావాలి.. యువతకు భవిష్యత్తు కావాలి.. రైతులకు భరోసా కావాలి.. పేదలకు సంక్షేమం కావాలి.. గ్రామాలకు మౌలిక వసతులు కావాలి. ఇవన్నీ పక్కనపెట్టి ప్రతిపక్ష నాయకులపై విమర్శలు చేయడం వల్ల ఎవరికీ ఉపయోగం లేదు" అని అన్నారు.

**అభివృద్ధి విషయంలో ప్రజలే తీర్పు చెప్పాలి**

గుండాల మండల అభివృద్ధిపై బీఆర్ఎస్ పార్టీకి స్పష్టమైన అవగాహన ఉందని, గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకున్నారని అన్నారు. ఎవరి హయాంలో ఏం జరిగిందో ప్రజలకు తెలుసని, రాజకీయ నాయకులు చెప్పే మాటలకంటే గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులే అసలు కొలమానమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులకు అభివృద్ధిపై నిజంగా నమ్మకం ఉంటే బహిరంగ చర్చకు రావాలని కోరారు. గుండాల బొడ్రాయి సెంటర్‌లో ప్రజల సమక్షంలో చర్చకు సిద్ధమా? అని మరోసారి ప్రశ్నించారు. చర్చకు తేదీ, సమయం కాంగ్రెస్ నాయకులే నిర్ణయించుకోవచ్చని, బీఆర్ఎస్ నాయకులు ఎప్పుడైనా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎవరి వాదన నిజమో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు.

**ప్రజా పాలన అంటే ప్రజల సమస్యలను పరిష్కరించడమే**

ప్రజా పాలన అంటే ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడం కాదని, ప్రజల సమస్యలను పరిష్కరించడం, సంక్షేమ పథకాలను అమలు చేయడం, అభివృద్ధి పనులు చేపట్టడం అని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా రాజకీయ కక్ష సాధింపు చర్యలను విడనాడి ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు గుండాల మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. "ప్రజా పాలన పేరుతో నయవంచక పాలన సాగించడం మానుకోవాలి. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలు మానుకోవాలి. అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. లేకపోతే ప్రజల తరఫున బీఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుంది" అని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి టి. రాము, యువజన విభాగం అధ్యక్షులు సయ్యద్ అజ్జు, కుంట సుధాకర్, తాటి కృష్ణ, పొంబోయిన సుధాకర్, బాల్య రాము, బొమ్మెర్ల శ్రీను, బొమ్మెర రవి, బొమ్మెర్ల పద్మారావు, బొమ్మెర్ల సతీష్, దానసరి భాస్కర్, భూక్య బాలు, గుగులోతు కాలు, గుగులోతు రవి, బొమ్మెర్ల శ్రీకాంత్, బొమ్మెర కృష్ణ, మహిళా మండల నాయకురాలు భూపెల్లి లలిత తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణి డీప్‌సైడ్ బ్లాక్ కోసం కృషి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు..
- కృతజ్ఞతలను తెలియజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

**మణుగూరు.ఆగస్టు 26 (డి డి 9వార్త)**

మణుగూరు సింగరేణి ఓసీ-2 డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణి సంస్థకు వచ్చేలా ప్రత్యేక చొరవ తీసుకుని, ఎంతో కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారిని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా డీప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణి పరిధిలోకి తీసుకురావడంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చూపిన ప్రత్యేక శ్రద్ధ, చొరవకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి గారిని శాలువాతో ఘనంగా సత్కరించి, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి పవిత్ర ప్రసాదాన్ని అందజేశారు. మణుగూరు ప్రాంతానికి ఎంతో ప్రాధాన్యత కలిగిన సింగరేణి ఓసీ-2 డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణి సంస్థ పరిధిలోకి రావడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు మరింత పెరగడంతో పాటు, కార్మికులు, ఉద్యోగులు మరియు వారి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే పాయం పేర్కొన్నారు.



అదే విధంగా మణుగూరు, పినపాక నియోజకవర్గంతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పారిశ్రామిక, ఆర్థిక మరియు మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిర్ణయం మరింత ఊతమిస్తుందని తెలిపారు. సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మణుగూరు ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత లభించేలా కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.పినపాక నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థ సహకారంతో మణుగూరు ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

## పాంచజన్యం సంకల్ప సభ పోస్టర్ ఆవిష్కరణ




**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 26 (డిడి9 వార్త) :**

ఈ నెల 31న నిజామాబాద్ కలెక్టరేట్ మైదానంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'పాంచజన్యం సంకల్ప సభ' పోస్టర్‌ను బుధవారం ఆర్మూర్ నియోజకవర్గంలో పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాంకిషన్ రావు, నవీన్ ఆచారి, నియోజకవర్గ ఇన్చార్జ్ మంతెన నవీన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. జిల్లా కేంద్రంలో జరిగే ఈ సంకల్ప సభను విజయవంతం చేయాలని, పెద్దసంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అవంతి కుమార్, సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు, సంతోష్, దినేష్, రాజు, నవీన్ పటేల్, శ్రీకాంత్ గౌడ్, నరేష్, సక్కరి, రమేష్ గౌడ్, రహీం, కృష్ణ, విజయ్, వంశీ, సుఖేష్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ వేదికపై 'తెలంగాణ' సాంస్కృతిక వైభవం

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 26 (డిడి9 వార్త) :**




భారతీయ సాంస్కృతిక ప్రాతినిధ్యాన్ని, మన మట్టి వాసనలను జాతీయ వేదికపై సగర్వంగా ఆవిష్కరిస్తున్నారు మన రాష్ట్ర ఉపాధ్యాయులు. న్యూఢిల్లీలోని 'సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 21 రోజుల సుదీర్ఘ ఓరియంటేషన్ కోర్సులో తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని, సంప్రదాయ విశిష్టతను తమ ప్రదర్శనల ద్వారా చాటిచెబుతున్నారు. నిజామాబాద్ జిల్లా బట్టు కళ్యాణి టిజిటి ఇంగ్లీష్, కే జి ఎఫ్ ఎస్ గుంజల్ యాచారం రంగారెడ్డి సారథ్యంలో ఈ ప్రతినిధి బృందం తెలంగాణ వైభవాన్ని నలుదిశలా చాటుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా బద్దెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని కత్తి స్వరూప రాణి, నిర్మల్ జిల్లా కొత్తమద్దిపడగ ఎంపీయూపీఎస్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్.కిషోర్, నిజామాబాద్ జిల్లా బెజ్జోర జెడ్పీహెచ్ఎస్ ఆంగ్ల ఉపాధ్యాయుడు బి.శ్రీనివాస్ తదితరులు ఈ బృందంలో భాగస్వాములై మన కళారూపాలను, పండుగల ప్రాశస్త్యాన్ని జాతీయ వేదికపై విశేషంగా ప్రదర్శిస్తున్నారు. రాష్ట్ర సాంస్కృతిక ఘనతను దేశ రాజధానిలో సగర్వంగా ప్రతిబింబిస్తున్న ఈ ఉపాధ్యాయ బృందానికి పలువురు విద్యారంగ ప్రముఖులు, తోటి ఉపాధ్యాయులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి



**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు26 (డిడి9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన అవారి భూముల దేవన్న భార్య ఇటీవల మృతిచెందగా, సమాచారం అందుకున్న మాజీ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి నివాసానికి వెళ్లిన ఆయన, మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబానికి తోడుగా ఉంటామని అభయం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శైలేందర్, కమ్మర్‌పల్లి మండల మాజీ అధ్యక్షుడు సుంకేటా రవి, జిల్లా నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బుచ్చి మల్లన్న, ఉప సర్పంచ్ శేఖర్, మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డిలతో పాటు నాయకులు తిరుపతి రెడ్డి, రాజేశ్వర్, రాజేష్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ కమిటీ డైరెక్టర్ జింక లింగానికి ఘన సన్మానం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు26 (డిడి9 వార్త):**

ఎడపల్లి మండలంలోని జానకంపేట్ శివార్లలో గల ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం పాలకమండలి డైరెక్టర్‌గా నియమితులైన జింక లింగాన్ని బుధవారం తెలంగాణ లోకల్ ఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జింక లింగం మాట్లాడుతూ... లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ డైరెక్టర్‌గా నియామకమై స్వామివారికి సేవ చేసుకునే భాగ్యం దక్కడం తన పూర్వజన్మ సుకృతమని సంతోషం వ్యక్తం చేశారు. పాలకవర్గ సభ్యులతో సమన్వయం చేసుకుంటూ ఆలయ సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మచ్కూరి గంగాధర్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు దౌర్ రత్నాకర్ రెడ్డి, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు శ్రీరామ్ ప్రసాద్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఇరెండ్ల నవీన్, సీనియర్ నాయకులు మైదాం ప్రతాప్ రెడ్డి, రావుట్ల స్వామి గౌడ్, రాజ్ కుమార్, సుధాకర్, చిన్న గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## రేపటి గ్రామ సభను ఓటర్లు సద్వినియోగం చేసుకోండి

- సర్ ప్రక్రియకు గ్రామ సభలే కీలకం
- కొత్త ఓటరు నమోదు,అభ్యంతరాల వ్యక్తీకరణ,పేర్లు, చిరునామా ల్లో మార్పులు,,చేర్పులకు అవకాశం
- బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్



**ఆదిలాబాద్ జిల్లా: సొనాల మండలం :- డి డి 9 న్యూస్**

ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా సోనాల మండలం లోని 223 బూత్ లో వచ్చిన నోటీసులను పరిశీలించి కొన్ని సవరణలు చేసి కావాల్సిన పత్రాలను రేపు జరగబోయే గ్రామ సభలో తీసుకొని రావాలని ఓటర్లకు విజ్ఞప్తి చేయడం జరిగింది.యువజన నాయకుడు గుడాల అనీష్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 27 న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే గ్రామ సభలు కీలకమని ఈ సభలో ఓటర్ల ముసాయిదా జాబితాలను బీఎల్ఓ లు చదివి వినిపిస్తారని తెలియచేసారు.తొలగించిన ఏఎస్ డిడి (ఆచూకీ దొరకనివి,వలస వెళ్లిన,మృతి చెందిన,డూప్లికేట్) ఓటర్ల వివరాలను క్లుప్తంగా వెల్లడి స్తారని తెలిపారు.ఎలక్షన్ కమిషన్ ఇటీవల విడుదల చేసిన ముసాయిదా జాబితాల ప్రకారం రాష్ట్రం లో మొత్తం 3.38 కోట్ల ఓటర్లలో ఏఎస్ డి డి కింద 73.39 లక్షల పేర్లను తొలగించారని,మిగిలిన 2.64 కోట్ల ఓటర్లలో అనామలిస్ మరియు అన్ మ్యాపింగ్ కింద 92.87 లక్షల మంది ఓటర్లకు ఎన్నికల సంఘం మరియు అధికారులు నోటీసులు ఇచ్చిందన్నారు ..కావున కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ లు అర్హత ఉన్న ప్రతి ఓటరు పేరును తుది జాబితాలో ఉండేలా ప్రతి ఓటును కాపాడేలా కృషి చెయ్యాలని అన్నారు .సోనాల మండలం లో 2846 నోటీసులు వచ్చాయని ప్రతి గ్రామం లోని వార్డు సభ లో ఫారం 6, 7, 8, లను అందుబాటులో ఉంచుతారని ఎవరైనా కొత్త ఓటరు గా నమోదయ్యేందుకు,ముసాయిదా జాబితాలోని పేర్లు మరియు చిరునామాలు వంటి వాటిలో తప్పులు,అక్షర దోషాలుంటే మార్పులు చేర్పులకు వీటిని ఉపయోగించుకోవాలని అక్కడికక్కడే అవసరమైన ఫారాలను నింపి తగిన ఆదారాలతో బీఎల్ ఓ లకు అందచేయాలని సూచించారు.

## చెస్ ప్రతిభావంతులకు ఘన సన్మానం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు26 (డిడి9 వార్త):**



జిల్లా స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ చాటి విజేతలుగా నిలిచిన సాయి సామల చెస్ అకాడమీ విద్యార్థులను బుధవారం బోధన్ పట్టణంలోని ఆర్య సమాజ్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మానికి విద్యా వికాస్ విద్యా సంస్థల అధినేత శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అండర్-17 పోటీల్లో రిష్విక్ బొర్రోల్లా ఛాంపియన్‌గా, గౌరాంగ అశోక్ రన్నరప్‌గా నిలిచారు. అండర్-13 విభాగానికి సంబంధించి గౌరాంగ అశోక్ ఛాంపియన్‌గా నిలవగా... సామల సాయి సుహాస్, మాదయ్య హితేంద్ర, ల్యాడ్లీ బ్రహ్మిణి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ...చదరంగం విద్యార్థుల్లో వ్యూహాత్మక ఆలోచనను, ఏకాగ్రతను పెంపొందిస్తుందన్నారు. విజేతలైన విద్యార్థులతో పాటు అకాడమీకి సెప్టెంబర్ 5న నగదు బహుమతులు అందజేయ నున్నట్లు తెలిపారు. బోధన్ నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని కోచ్ సాయిబాబా సామల పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సర్పంచుల ఫోరం ఎన్నికలపై రాజకీయ వేడి..

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 26(డిడి9 వార్త):**

బీర్కూర్ మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గ సన్మాన కార్యక్రమం రాజకీయంగా వేడెక్కింది. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని నూతన కార్యవర్గానికి ఘన సన్మానం నిర్వహించారు. సుమారు 200 మంది కాంగ్రెస్ శ్రేణుల సమక్షంలో జరిగిన ఈకార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బోయిని శంకర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.ఇటీవల తనను కోరం లేని ఫోరం అధ్యక్షుడు అంటూ కొందరు చేస్తున్న విమర్శలపై బోయిని శంకర్ ఘాటుగా స్పందించారు.నన్ను కోరం లేదని విమర్శించే వారు ముందుగా తమ ఎన్నికకు ఉన్న నైతిక బలాన్ని చెప్పాలి.కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన కొందరు సర్పంచులు కలిసి బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఏకైక సర్పంచును ఫోరం అధ్యక్షుడిగా ఎన్నుకున్నప్పుడు ఆ ఎన్నికకు కోరం ఎక్కడి నుంచి వచ్చింది? అంటూ ప్రశ్నించారు. తనపై ఎన్ని విమర్శలు చేసినా సర్పంచుల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.విమర్శలకు సమాధానం మాటలతో కాదు.. పనిచేసి చూపిస్తామని అన్నారు.మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులను ఏకతాటిపైకి తీసుకువచ్చి, వారి హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ అధికారుల వద్ద గట్టిగా పోరాడుతామని పేర్కొన్నారు.బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధిపై కూడా బోయిని శంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు.గత నాలుగు దశాబ్దాలుగా నియోజకవర్గ అభివృద్ధికి పోచారం శ్రీనివాస్ రెడ్డి చేసిన కృషిని ఎవరూ తక్కువ చేసి చూపలేరని అన్నారు.అభివృద్ధి అంటేనే పోచారం.. పోచారం అంటేనే బాన్సువాడ అభివృద్ధి అని స్పష్టం చేశారు. ప్రతిపక్ష విమర్శలకు భయపడేది లేదని, ప్రజల కోసం పనిచేసే నాయకత్వమే తమ బలం అని బోయిని శంకర్ అన్నారు.గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, మౌలిక వసతులు వంటి సమస్యలపై సర్పంచులతో కలిసి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.సర్పంచుల ఫోరం ఎన్నికతో మండల రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేచిందని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించిన కార్యక్రమం ఒకవైపు ఐక్యతను చాటగా, మరోవైపు ప్రత్యర్థుల విమర్శలకు కాంగ్రెస్ శ్రేణులు గట్టి రాజకీయ కౌంటర్ ఇచ్చిన వేదికగా నిలిచింది.ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు బాన్సువాడ మనెవ్వ, ప్రధాన కార్యదర్శి దేవి సింగ్, సభ్యులు భోగవల్లి అప్పారావు, మద్దినేని నాగరాజ కుమారి, కురుమ సునీత ఏఎంసీ చైర్మన్ శ్యామల,వైస్ చైర్మన్ యామ రాములు, యువనా యకులు మియాపురం శశికాంత్,ఉపసర్పంచ్ పరమేష్ కార్యకర్తలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

# పాపం పండింది.....!

- ఎక్సైజు శాఖలో అధికార దుర్వినియోగంపై చర్యలు
- భద్రాచలం ఎక్సైజు సీఐ, కానిస్టేబుల్ సస్పెన్షన్
- ఆది నుంచి వివాదాల నడుమే ఆ అధికారిణి బాధ్యతల నిర్వహణ
- ఏసీబీ విచారణ జరిపిస్తే మరిన్ని నిజాలు వెలుగులోకి ?






**భద్రాచలం, ఆగస్టు 26 (డిడి9 వార్త)**

భద్రాచలం ఎక్సైజు కార్యాలయంలో పాపం పండింది. అన్నీతానై ఏకచత్రాధి పత్యంగా వ్యవహరిస్తున్న ఆ అధికారిణిపై ఉన్నతాధికారులు ఎట్టకేలకు చర్యలకు ఉప క్రమించారు. సుదీర్ఘకాలం పాటు ఇక్కడే పని చేసిన సదరు అధికారిణి నల్గొండ జిల్లాలో భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు సిబ్బందిలోనే జోరుగా చర్చ సాగుతోంది. అవినీతి నిరోధక శాఖ అధికారులు దృష్టిసారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. గడిచిన ఐదేళ్ల కాలంలో ఎక్సైజు కార్యాలయంలో అనేక తవకలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. గంజాయి అక్రమ రవాణాలో ముడుపుల వ్యవహారాలు, పాత వాహనాల వేలంలో అక్రమాలు, కొన్ని వాహనాలను స్క్రాప్ పేరుతో బయటి వ్యక్తులకు అమ్మకం, గంజాయి కేసులో వదిలేసిన వాహనాలను మాయం చేసిన సంఘటనలు అనేక చోటు చేసుకున్నాయి. అలాగే సీఆర్‌పీఎఫ్‌కు చెందిన మద్యం బాటిళ్ల విషయంలో ఓ వ్యక్తిని తీవ్ర ఇబ్బందులు గురి చేసి అతని నుంచి అధిక మొత్తంలో వసూలు చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. ఈ విషయంపై బహిర్గమైనప్పటికీ ఆ అధికా రిణికి ఉన్న పలుకుబడితో ఎటువంటి చర్యలు లేకుండానే బయటపడింది. అలాగే బెల్టుషాపుల నిర్వహణ అంతా ఆమె కనుస న్నల్లోనే సాగుతోందనే విమర్శలు జోరుగా ఉన్నాయి. ఉన్నతాధికారులు లోతుగా విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### ఎక్సైజు సీఐ, కానిస్టేబుల్ సస్పెన్షన్

భద్రాచలం ఎక్సైజు సీఐ రహీమున్నీ సాబేగం, కానిస్టేబుల్ రవికుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు నిందితులను గంజాయి కేసులో అరెస్టు చూపాల్సి ఉండగా ఒకరు పారిపోవడంతో ఆ విషయంను గోప్యంగా ఉంచి పంచనామ నివేదికను సీఐ తారుమారు చేసినట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలింది. దీంతో సస్పెన్షన్ వేటు పడింది. కాగా ఈ ఘటనలో మరికొందరు సిబ్బందిపై సైతం శాఖపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఎక్సైజు వర్గాల్లో చర్చ సాగుతోంది. అరెస్టు సమయం నుంచి రిమాండ్ వరకు జరిగిన సంఘటనలను అంశాల వారీగా విచారించి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, విషయాన్ని గోప్యంగా ఉంచి రికార్డులు మార్చిన విషయంపై ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది.

### ఆమె తీరు ఆది నుంచి అంతే...?

భద్రాచలం ఎక్సైజు శాఖ కార్యాలయంలో కీలకంగా వ్యవహరించి సస్పెన్షన్‌కు గురైన సదరు అధికారిణి తీరు ఆది నుంచి విధి నిర్వహణలో అనేక విమర్శల మధ్యే కొనసాగింది. ఎక్సైజు కార్యాలయంలో పట్టుబడిన వాహనాలను వేలంపాట నిర్వహించే సమయంలో సరైన నిబంధనలు పాటించకుండా అవకవకలకు పాల్పడ్డారని విమర్శలు ఎదుర్కొన్నారు. ఒక ఆటోను రికార్డుల్లో స్క్రాప్‌గా పేర్కొంటూ బయట వ్యక్తులకు అమ్మగా, ఈ విషయం బయటకు రావడంతో మళ్లీ తిరిగి ఆ ఆటోను స్టేషన్‌కు తరలించారు. అలాగే కొందరు సిబ్బంది సైతం కార్యాలయంలో ఉన్న పలు వాహనాలను తమ సొంత అవసరాలకు వినియోగి స్తున్నట్లు జోరుగా ఆరోపణలు వస్తున్నాయి. అదేవిధంగా భద్రాచలంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్టుషాపులను అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. మామూళ్ల మత్తులో ఆధ్యాత్మిక క్షేత్రాన్ని బెల్టుమయంగా మార్చారని ప్రజలు చర్చిం చుకుంటున్నారు.

### గంజాయి రవాణపై నిఘా కరువు?

ఉన్నతాధికారులు జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం గంజాయిపై ఉక్కుపాదం మోపుతూ అక్రమ రవాణా అరికట్టేందుకు నానా తంటాఉ పడుతుంటే భద్రాచలం మీదుగా తరచూ రవాణా అవుతున్న గంజాయి రవాణా వ్యవహారంలో తరచూ ఎన్‌ఫోర్సుమెంటు అధికారులే ఎక్కువగా కేసులు నమోదు చేస్తుంటారు. కాని గంజాయి రవాణాపై పూర్తిగా నిఘా ఉంచాల్సిన భద్రాచలం ఎక్సైజు శాఖ అధికారులు మాత్రం పెద్దగా దృష్టిసారించకపోవడం గమనార్హం. ప్రతి నెల ఎక్కువ కేసులు ఎన్‌ఫోర్సుమెంటు అధికారులే ఖమ్మం నుంచి వచ్చి మరీ పట్టుకుంటున్నా, భద్రాచలంలో ఉన్న ఎక్సైజు అధికారులకు అడపాదడపా తప్ప పెద్దగా గంజాయి అక్రమ రవాణాపై దృష్టి సారించడం లేదనే అపవాదు సైతం ఉంది. అలాగే స్థానికులు బెల్టుషాపులపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా వాటిని బుట్టదాఖలు చేయడం తప్ప కనీస చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

## కులమతాలకు అతీతంగా గంగా జమునా తహజీబ్‌ను కాపాడాలి

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్
- నిజామాబాద్‌లో మిలాద్ ఉన్ నబీ ఘనంగా వేడుకలు

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 26 (డిడి9 వార్త) :**



నిజామాబాద్ నగరంలో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. నగరంలోని ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ నగర పుర వీధుల గుండా ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. అనంతరం ఖిలా రోడ్డు, నెహ్రూ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు... ప్రవక్త మహమ్మద్ బోధించిన ప్రేమ, శాంతి, సోదరభావం, మానవత్వం వంటి ఉత్తమ విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ... మనిషిని మనిషిగా గౌరవించడం, కష్టాల్లో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన మానవత్వమని పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతాల పేరుతో విభేదాలు సృష్టించుకోవద్దని హితవు పలికారు. తెలంగాణ సమాజం ఎప్పటి నుంచో కులమతాలకు అతీతంగా కలిసి జీవించే గొప్ప సంస్కృతిని కలిగి ఉందనడానికి ఇక్కడి గంగా జమునా తహజీబే నిదర్శనమని, ఈ సామరస్యాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ లౌకిక సిద్ధాంతాలకు కట్టుబడి పనిచే స్తుందని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు. ప్రతి పౌరుడూ ప్రశాంతంగా, గౌరవంగా జీవించేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, నాయకులు శేఖర్ గౌడ్, నరాల రత్నాకర్, జావిద్ అక్రమ్, కూద్దూస్, హారున్, కార్పొరేటర్లు సజ్జాద్, రహీల్, నయీమ్, షారాన్, అబ్దుల్ కరీం, మీలాద్ కమిటీ అధ్యక్షులు షోయబ్ రజా, ముజాహిద్ ఖాన్, మత పెద్దలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు ఓటర్ జాబితా సవరణ గ్రామసభలు

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- బోధన్ ఆర్డీవో, ఈఆర్ఓ విజయకుమారి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు26 (డిడి9 వార్త):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు బోధన్ ఆర్డీవో, ఎన్నికల నమోదు అధికారి, ఈఆర్ఓ విజయకుమారి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఓటర్ జాబితాను పారదర్శకంగా రూపొందించడమే లక్ష్యంగా ఈ సభల్లో ముసాయిదా ఓటర్ జాబితాను బహిరంగంగా చదివి వినిపిస్తా రన్నారు. మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మారిన వారు, డబుల్ ఎంట్రీలు, గైర్హాజరైన ఓటర్ల వివరాలను సభలో పరిశీలిస్తారన్నారు. ఓటర్లు తమ పేర్లలో తప్పులు, మార్పులు చేర్పులు ఉంటే అక్కడి కక్కడే అధికారుల దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. సభల్లో బీఎల్వోలు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొంటారని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకో వాలని కోరారు.

# కొత్త సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

- సోనాల మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- కొత్త సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసిన డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ గారు



**ఆదిలాబాద్ జిల్లా, సోనాల డి డి9 న్యూస్:-**

సోనాల మండలం సాకేరా గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ గారు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ గ్రామ ప్రజలు డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ గారిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాకేరా గ్రామంలోని జగదాంబ అమ్మవారి ఆలయాన్ని, సేవాలాల్ మహారాజ్ మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు డా. నరేష్ జాదవ్ గారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డా. నరేష్ జాదవ్ గారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతూ ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు సాకేరా సర్పంచ్ జాదవ్ మోతిసింగ్ గారు,మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనా రాయణ గారు, సోనాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజుల పోతన్న గారు,జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు ఆసిఫ్ ఖాన్ గారు, రమేష్ గారు.సంతోష్ గారు. మహమూద్, శ్రీనివాస్ గారు సున్నం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పెద్దలు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518